సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం ౹ 1 ౹ జనవరి ౹ 2023

నేడు రామయ్య జలవిహారం

ఉదయం నుంచే ప్లవోత్సవాలు ప్రారంభం

- ఆగమశాస్త్ర పద్ధతిలో సీతారాములకు విశేష పూజలు
- సాయంత్రం పవిత్ర గోదావరిలో తెప్పోత్సవం
- ఇతర ఆలయాలకూ చేరిన భద్రాద్రి సంస్కృతి


గోదావరి నదిలో స్వామివారి తెప్పోత్సవానికి సిద్ధమైన హంసవాహనం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: శ్రీరాముడికి భద్రగిరిపై అత్యంత వైభవంగా జరిగే వేడుకల్లో నవమి కల్యాణం, ముక్కోటి అధ్యయనోత్సవాలు ముఖ్యమైనవి. ఈ రెండు సందర్భాల్లో సీతారాములను కనులారా దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు ఇక్కడికి వస్తుంటారు. ముఖ్యంగా ముక్కోటి సందర్భంగా నిర్వహించే తెప్పోత్సవం కనులపండువగా సాగుతుంది. నేడు స్వామివారికి జరిగే ఈ వేడుక విశేషాలు తెలుసుకుందాం..

21 రోజుల వేడుకలు

సూర్యుడు ధనురాశిలోకి ప్రవేశించిన తర్వాత 11వ రోజు (ఏకాదశి)ను మధ్యగా చేసుకుని అటు పది రోజులు, ఇటు పది రోజులు మొత్తంగా 21 రోజుల పాటు వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. వైష్ణవంలోని ఆగమ శాస్త్ర పద్ధతులను పాటిస్తూ ఏకాదశికి ముందు 10 రోజుల పాటు జరిగే ఉత్సవాలను పగల్ పత్తు, ఏకాదశి తర్వాత జరిగే ఉత్సవాలను రాపత్తు ఉత్సవాలుగా పిలుస్తారు. పగల్ పత్తు ఉత్సవాల్లో శ్రీరాముడు తొమ్మిది అవతారాల్లో భక్తులకు దర్శనం ఇస్తారు. వివిధ రూపాల్లో అలంకరించిన స్వామివారిని పుర వీధుల్లో ఊరేగిస్తారు. అయితే పదోరోజు మాత్రం స్వామివారు ప్రత్యేకంగా జల విహారానికి వెళ్తారు. ఆగమ శాస్త్రంలో ప్లవోత్సవంగా పేర్కొనే ఈ వేడుకను సాధారణ పరిభాషలో తెప్పోత్సవం అంటారు.

ప్లవోత్సవం రోజున ప్రత్యేక పూజలు..

ప్లవోత్సవం రోజున ముందుగా సుప్రభాత సేవ ఉంటుంది. ఆ తర్వాత తిరుప్పావై సేవాకాలం చేస్తారు. అనంతరం మూలవరులకు అభిషేకం, తర్వాత వేద పారాయణం, ప్రబంధ పాశుర అనుసంధానం, తిరుమంగై ఆళ్వార్ పరమ పదోత్సవం నిర్వహిస్తారు. ఇందులో నిత్య సేవగా సుప్రభాతం, ఆదివారం సేవగా మూలవరులకు అభిషేకం మినహాయిస్తే మిగిలిన విశేష పూజలన్నింటినీ అధ్యయనోత్సవాల్లో భాగమైన ప్లవోత్సం రోజున ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చేస్తుంటారు.

ప్లవోత్సవ దర్శనం.. ఎంతో పుణ్యఫలం

నేటి మధ్యాహ్నం స్వామివారికి దర్బారు సేవ నిర్వహిస్తారు. ఆ తర్వాత మేళతాళాల నడుమ ఉత్సవ మూర్తులను గోదావరి తీరానికి తీసుకెళ్తారు. అక్కడ ఆగమ శాస్త్ర పద్ధతులను అనుసరిస్తూ హంసాకృతిలో అలంకరించిన పడవలో సీతారాములను వేంచేపు చేస్తారు. అనంతరం షోడశోపచారాలతో పూజలు చేస్తారు. చివరగా హారతులు ఇస్తారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. ఈ సమయంలో కోదండరామయ్యను దర్శనం చేసుకుంటే కోటి శుభాలు కలుగుతాయని, విశేష పుణ్యఫలాలు లభిస్తాయని భక్తుల నమ్మకం. చివరగా హంసాలంకరణ పడవలో జల విహారానికి సీతారాములు వెళ్తారు. ఒక్కో పరిక్రమణానికి ఒక్కో రకమైన హారతి ఇస్తూ కనులవిందుగా ఈ వేడుకను నిర్వహిస్తారు.

51 ఏళ్లుగా తెప్పోత్సవం..

ప్లవోత్సవాన్నే వ్యవహారిక భాషలో తెప్పోత్సవంగా పిలుస్తున్నాం. ఈ ఉత్సవాల్లో పడవల స్థానంలో హంసవాహనంలో 51 ఏళ్లుగా స్వామివారి జల విహారం సాగుతోంది. 1971లో అప్పటి పాలకమండి చైర్మన్ అల్లూరి మూర్తిరాజు ఈ హంస వాహనానికి శ్రీకారం చుట్టారు. హైదరాబాద్‌కు చెందిన సారథి స్టూడియోకు చెందిన కళాకారులను రప్పించి పడవను హంసాకృతిలో డిజైన్ చేయించారు. ఆ రోజుల్లోనే హంస వాహనంలో రాముల వారి జల విహారానికి విశేష ప్రాచుర్యం దక్కింది. దీంతో ప్రతి సంవత్సరం హంస వాహనంలోనే తెప్పోత్సవం నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.20 వేలు వెచ్చించి శాశ్వత పద్ధతిలో అలంకరణ సామగ్రి చేయించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ పరంపర కొనసాగుతూ వస్తోంది.

భద్రాద్రి నుంచే శ్రీకారం..

హంసాకృతి పడవలో భద్రాద్రి రామయ్య చేసే జల విహారం కనుల పండువగా ఉండడంతో ఇతర ప్రముఖ ఆలయాలు సైతం హంసాకృతి పడవను ఉపయోగించేందుకు ఉత్సాహం చూపాయి. ముందుగా విజయవాడ కనకదుర్గమ్మకు తెప్పోత్సవం నిర్వహించేందుకు భద్రాద్రి నుంచే హంసాకృతి పడవను తీసుకెళ్లేవారు. ఆ తర్వాత సింహాచలం, అన్నవరం ఆలయాలకూ ఈ సంస్కృతి చేరువైంది. అనంతరం వారే సొంతంగా హంస వాహనాలను తయారు చేసుకున్నారు. ప్రస్తుతంరెండు తెలుగు రాష్ట్రాల్లో తెప్పోత్సవ వేడుకలు విరివిగా జరుగుతున్నాయి. అన్ని చోట్లా హంస డిజైన్ పడవ/ తెప్పలనే ఉపయోగిస్తున్నారు. నదులు ఉన్న చోట పెద్దవిగా, చెరువులు ఉన్న చోట చిన్నవిగా హంస తెప్పలు దేవేరులను జల విహారానికి తీసుకెళ్తున్నాయి. 50 ఏళ్ల కిందట భద్రాచలంలో మొదలైన హంసాలంకరణ తెప్పోత్సవం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాలకూ సుపరిచితమైంది.

ప్రజలకు మరింత చేరువగా..



- 'వాడవాడకు పువ్వాడ' కార్యక్రమానికి నేడు శ్రీకారం
- సమస్యల పరిష్కారానికి రూ.32 కోట్లు వెచ్చించేలా ప్రణాళిక
- రాష్ట్రంలోనే అభివృద్ధికి కేరాఫ్‌గా ఖమ్మం
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'గత నాలుగేళ్లలో కొత్త ఖమ్మంను ఆవిష్కరించాం. రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ వ్యవస్థలను మెరుగుపరిచాం. మూడేళ్లలో ఖమ్మం నగరంలోనే 2వేల డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తి చేశాం. అనేక సంక్షేమ పథకాలను అమలు చేశాం. యువత క్రీడలవైపు మొగ్గు చూపేందుకు సౌకర్యాలు కల్పించాం, ఆహ్లాదంగా గడిపేందుకు పార్కులు నిర్మించాం. రఘునాథపాలెం మండలంలోనే రూ.253 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా మిగిలిన పనులు పూర్తి చేసేలా ముందుకెళ్తాం. ప్రజలకు మరింత చేరువవుతూ, ఇంకా ఏయే సమస్యలు ఉన్నాయో తెలుసుకునేందుకు వారి ఇళ్ల లోగిళ్లకు వెళ్లేందుకు ఖమ్మం నగరంలో వాడవాడకు పువ్వాడ.. పేరిట కార్యక్రమం మొదలుపెడుతున్నాం' అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. కొత్త సంవత్సరం సందర్భంగా ఆదివారం నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. నూతన సంవత్సరం సందర్భంగా శనివారం మంత్రి 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే...

'వాడవాడకు పువ్వాడ'తో ప్రజల్లోకి..

ప్రజల సమస్యలు ఇంకా ఏమున్నాయో తెలుసుకునేందుకు 'వాడవాడకు పువ్వాడ' కార్యక్రమాన్ని ఖమ్మం నగరంలో తలపెట్టాం. ఆదివారం 17వ డివిజన్‌లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. నేను ఖమ్మంలో ఉన్న సమయంలో ఉదయం 6.30నుంచి 8.30 గంటల వరకు డివిజన్లలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుంటా. నా వెంట మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ఉంటారు. ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తాం. వ్యక్తిగత సమస్యలను పరిష్కరించేందుకు కూడా ప్రాధాన్యతనిస్తా. ఈ కార్యక్రమం కోసం ఎల్‌ఆర్‌ఎస్ నిధులు రూ.20 కోట్లు, సుడా నిధులు రూ.12 కోట్లు వెచ్చించడానికి ప్రభుత్వ అనుమతి కోరా. గతంలో సైకిల్, ద్విచక్ర వాహనాలపై ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరించా.

సంక్షేమానికి రూ.90 కోట్లు..

నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి ద్వారా రూ.75 కోట్లు, సీఎంఆర్‌ఎఫ్ కు రూ.15 కోట్లు ఖర్చు చేశాం. అలాగే, 30 వేల పెన్షన్లు పంపిణీ చేస్తున్నాం. సర్దార్ పటేల్ స్టేడియంలో టెన్నిస్‌కోర్టు, స్కేటింగ్ రింక్ ఏర్పాటు ద్వారా యువతకు క్రీడలపై ఆసక్తి పెంపొందించాం. లకారం ట్యాంక్‌బండ్‌లో కేబుల్ బ్రిడ్జి తోపాటు మ్యూజికల్ ఫౌంటెన్, ప్రజల ఆరోగ్యం కోసం పార్కులు, ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేశాం. ఇలా ఖమ్మంలో ఊహించని స్థాయిలో జరిగిన అభివృద్ధిని చూసి అంతా మంత్రముగ్ధులవుతున్నారు. ఖమ్మంను ఆదర్శంగా తీసుకోవాలని, ఖమ్మంను చూడాలని పలు జిల్లాల అధికారులు చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు.

రూపురేఖలు మార్చాం..

గత నాలుగేళ్లుగా కొత్త ఖమ్మంను ఆవిష్కరించాం. కొత్త బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం, కలెక్టరేట్లను 2022లో నిర్మించుకున్నాం. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో 140 రోడ్లు నిర్మించాం. ఈ ఏడాది తీసుకున్న మున్సిపల్ నిధులతో 42 కిలోమీటర్ల కొత్త డ్రెయిన్లు నిర్మాణం చేశాం. గోళ్లపాడు చానల్ పూర్తి చేసి ఆరు పార్కులు ఏర్పాటు చేశాం. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కూడా పూర్తయింది.

జిల్లాను రోల్ మోడల్‌గా నిలుపుతాం

కలెక్టర్ అనుదీప్


అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో జిల్లాను రోల్ మోడల్‌గా నిలుపుతామని కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ అన్నారు. నూతన సంవత్సరంలో చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దళితబంధు, మన ఊరు - మన బడి, విద్య, వైద్యం, బీటీపీఎస్, సీతారామ ఎత్తిపోతల పథకాలకు భూసేకణ ప్రక్రియ, పల్లె, పట్టణ ప్రగతి, హరితహారం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు తదితర ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలపై మరింతగా దృష్టి సారిస్తామని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

భద్రాద్రిలో భారీ భద్రత


ఏర్పాట్లను పరిశీలిస్తున్న సాయిమనోహర్, పక్కన రోహిత్‌రాజ్

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో నేడు జరిగే తెప్పోత్సవం, రేపటి ముక్కోటి ఏకాదశి వేడుకలకు వీవీఐపీలు, పలువురు ప్రముఖులు రానున్నందున భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. 1200 మంది పోలీసులు ఈ విధుల్లో పాల్గొనున్నారు. ఇప్పటికే భద్రాచలం చేరుకున్న పోలీసులు వేడుకలు జరిగే ప్రదేశం వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. 8 మంది డీఎస్పీలు, 25 మంది సీఐలు, 70 మంది ఎస్‌ఐలు, 218 మంది ఏఎస్‌ఐలు, 280 మంది కానిస్టేబుళ్లు, 100 మంది మహిళా కానిస్టేబుళ్లు, 499 మంది హోంగార్డులు విధులు నిర్వహించనున్నారు. కాగా, ఆదివారం జరిగే తెప్పోత్సవం, సోమవారం నాటి ఉత్తర ద్వార దర్శనానికి సంబంధించిన భద్రత ఏర్పాట్లను ఓఎస్డీ సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ రోహిత్‌రాజ్ శనివారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, ఎస్‌ఐలు శ్రీకాంత్, మధుప్రసాద్, పీవీఎస్ రావు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీఓ శుభాకాంక్షలు

భద్రాచలం : జిల్లా ప్రజలకు ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వారు శనివారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. 2023లో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని వారు ఆకాంక్షించారు.

‘ముక్కోటి’ ఏర్పాట్లు పూర్తి

టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనుదీప్



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ముక్కోటికి వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. శనివారం ఆయన అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గోదావరిలోకి భక్తులు దిగకుండా హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. తప్పిపోయిన భక్తుల సమాచారాన్ని ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 08743–232444 కాల్‌సెంటర్‌కు వివరాలు అందజేయాలన్నారు. వీవీఐపీ, వీఐపీ సెక్టార్ల తోపాటు ఆరు ఉచిత సెక్టార్లు ఏర్పాటు చేశామని, ఒక్కో సెక్టార్ కు ముగ్గురు ప్రత్యేకాధికారులను నియమించామని వివరించారు. అధిక ధరలకు ఆహార పదార్థాలు విక్రయించకుండా పౌర సరఫరాల అధికారి, ఆర్డీఓ నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. హంసవాహన పటిష్టతపై ధ్రువీకరణ సర్టిఫికెట్ ఇవ్వాలని ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్‌ను ఆదేశించారు. 1.25 లక్షల లడ్డూలు విక్రయాలకు సిద్ధంగా ఉంచనున్నట్లు చెప్పారు. లడ్డూలు విక్రయించేటప్పుడు చేతులకు గ్లౌజులు, హెడ్ మాస్కులు ధరించాలన్నారు. సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. 24 గంటలూ నిరంతర వైద్య సేవలు అందించేలా అత్యవసర చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గజ ఈతగాళ్లను, లైఫ్ జాకెట్లు సిద్ధంగా ఉంచాలని, పర్ణశాలలో నీరు ఎక్కువగా ఉన్నందున భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. మిరుమిట్లు గొలిపే బాణసంచా పేల్చే క్రమంలో రక్షణ చర్యలు పాటించాలని డీఆర్‌ఓకు సూచించారు. టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, దేవస్థానం ఈఓ శివాజీ, విద్యుత్ ఎస్‌ఈ రమేష్, డీపీఓ రమాకాంత్, వైద్యాధికారి శిరీష, మత్స్యశాఖాధికారి వీరన్న, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, కొత్తగూడెం, భద్రాచలం ఆర్‌డీఓలు స్వర్ణలత, రత్నకళ్యాణి పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

కొత్తగూడెంటౌన్: జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలను శనివారం నిర్వహించి క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సాయితేజ, కార్యదర్శి కె. నవీన్‌కుమార్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 21, 22, 23 తేదీల్లో భూపాలపల్లిలో జరిగే రాష్ట్ర సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. ఎ.రంజిత్, పి.శివరాం, సాయితేజ, కౌశిక్, పృథ్వీరాజ్, లీలా, కృష్ణ విజయ్ సాయి, మహేష్ శ్రీసాయి సంతోష్, ఆర్, శివమణి, లక్ష్మీనారాయణ, అనిల్‌కుమార్, వర్ధన్ నాయక్, కార్తీక్, ప్రదీప్, గణేష్, చరణ్ జట్టుకు ఎంపికయ్యాని వివరించారు. కార్యక్రమంలో సెయింట్ జేవీఆర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ ఆనంద్, పీఈటీలు బద్రీలాల్, నారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విధులకు సకాలంలో హాజరు కావాలి

ఆర్‌డీఓ రత్న కళ్యాణి



మాట్లాడుతున్న ఆర్‌డీఓ రత్న కళ్యాణి

భద్రాచలం: ముక్కోటి ఉత్సవాలకు విధులను కేటాయించిన అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని భద్రాచలం ఆర్‌డీఓ రత్న కళ్యాణి అన్నారు. శనివారం సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో విధులను కేటాయించిన అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనాలను విజయవంతం చేయాలని కోరారు. వీఐపీలతో పాటు సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

మహాప్రసాదం.. రామయ్య లడ్డూ

ముక్కోటి వేడుకలకు 2 లక్షల లడ్డూలు..



స్వామి వారి లడ్డూలను ప్యాకింగ్ చేస్తున్న సేవకులు

భద్రాచలం: అవతార పురుషుడు, లోకజగన్నాథుడిగా పిలవబడే శ్రీసీతారామచంద్రస్వామి వారిని భక్తులు దర్శించుకుని ప్రసాదాలను స్వీకరిస్తుంటారు. ప్రసాదాలను అమృతఫలంగా భావిస్తూ స్వీకరించిన వారికి సర్వ గ్రహ బాధలు తొలగిపోయి, ఆ రాముడే నిరంతరం సదా కాపాడుతూ ఉంటారని భక్తులు విశ్వసిస్తారు. అలాంటి మహాప్రసాదమైన రామయ్య లడ్డూలను ముక్కోటికి వచ్చే భక్తుల కోసం సిద్ధం చేస్తున్నారు. సుమారు 2 లక్షల లడ్డూలను అందుబాటులో ఉంచుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

భక్తులకు మక్కువ..

భగవంతునికి సమర్పించిన ప్రసాదాన్ని స్వీకరించటం వల్ల ఆ భగవంతుని అనుగ్రహం కల్గుతుందని, ఆ ప్రసాదాన్నే అమృతఫలంగా భక్తులకు అందచేస్తాడని పండితులు పేర్కొంటున్నారు. భగవంతునికి ఇష్టమైన తీపి పదార్థాలతోటే ప్రసాదాలను నైవేద్యాలుగా సమర్పిస్తుంటారు. భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారికి ప్రధానంగా లడ్డూ, పులిహోర, చక్కెర పొంగళి, రవ్వకేసరిలను పెడుతుంటారు. అయితే వీటిలో చక్కెర పొంగళి, పులిహోర, రవ్వకేసరి అన్ని సమయాల్లో నిల్వ ఉండటం సాధ్యం కాదు. కాబట్టి ఆయా సమయాల్లో మాత్రమే వాటిని అందుబాటులో ఉంచుతారు. కానీ నిల్వ ఉండే లడ్డూలను మాత్రం భక్తుల కోసం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుతారు. భక్తులు సైతం అధికంగా లడ్డూలనే స్వామి వారి ప్రసాదంగా భావించి కొనుగోళ్లు చేస్తుంటారు. స్వామి అనుగ్రహంతో వారికి నైవేద్యంగా పెట్టి భక్తులకు అందచేసే ప్రసాదాలను స్వీకరించటం వల్ల బుద్ధి, జ్ఞానం, సత్ప్రవర్తన కలుగుతాయని శాస్త్రాలు చెబుతున్నాయి. భద్రాచల శ్రీసీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో తయారు చేసే లడ్డూలకు చాలా ప్రత్యేకత ఉంది. తినటానికి చాలా రుచిగా ఉంటుంది. ఈ లడ్డూలను తయారుచేసే కార్మికులు సైతం చాలా నిష్ఠతో, పవిత్రంగా తయారు చేస్తుంటారు.

రామయ్య చెంతన ‘గౌతమి’ నృత్య పరవళ్లు

అలరించిన ఖమ్మం కలెక్టర్ సతీమణి నృత్యరూపకం

భద్రాచలం: భద్రాచలంలో జరుగుతున్న ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా మిథిలా స్టేడియం వద్ద ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేస్తున్నారు. ఈమేరకు శనివారం ఖమ్మం జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సతీమణి గౌతమి ప్రదర్శించిన నృత్యరూపకం అలరించింది. నృత్యగురువు మీనాకుమారి నేతృత్వాన బృందంతో కలిసి ఆమె సీతాకళ్యాణానికి కూచిపూడి నృత్యంతో దృశ్యరూపం కల్పించారు. ఇదిగో భద్రాద్రి.. అదిగో భద్రాద్రి చూడండి అంటూ సాగిన కీర్తనలకు గౌతమి ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. అనంతరం గౌతమితో పాటు ఆమె గురువు, బృందాన్ని సత్కరించారు. కాగా, కార్యక్రమానికి వచ్చిన ఖమ్మం కలెక్టర్ గౌతమ్‌కు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.



నృత్య ప్రదర్శనలో గౌతమి



సత్కారంలో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్ దంపతులు

అంబేడ్కర్ చరిత్ర ఆచరణీయం

భారజల కర్మాగారం జీఎం కేవీ.థాలే



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న జీఎం తదితరులు

అశ్వాపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ చరిత్ర ఆచరణీయమని, ఆయన చరిత్రను క్యాలెండర్‌లో ముద్రించడం సంతోషకరమని మణుగూరు భారజల కర్మాగారం జీఎం కేవీ.థాలే అన్నారు. మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో భారజల కర్మాగారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను జీఎం ఆయన ఆవిష్కరించారు. మొదట జీఎంతో పాటు నాయకులు అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ విద్యార్థులు, యువత అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఏఓ కాంబ్లే, సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోగుల కొమరయ్య, పొద్య కేశవరావు, నాయకులు రత్నకుమార్, స్వామి, వినయ్‌సాగర్, టీఎస్‌పీ.రవికుమార్, సాలిక్, రాంబాబు, శ్రీనివాసరావు, లక్ష్మణ్‌కుమార్, రంజిత్, దయాకర్ నరసింహప్ప, సత్యనారాయణ, రాజయ్య, ప్రసీల్ పాల్గొన్నారు.

● ‘నూతన’ సందడి..



కాంట్రాక్టర్స్ కాలనీలో విద్యుత్ దీపాల వెలుగులో ఎల్‌జీఎం చర్చి

పాల్వంచ: పట్టణంలో శనివారం అర్ధరాత్రి దాటక నూతన సంవత్సర జోష్ కనిపించింది. న్యూయర్ కేక్, పుష్పగుచ్ఛాల స్టాల్స్‌ను విరివిగా వెలిశాయి. అర్ధరాత్రి నుంచే ఇళ్ల ముందు రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు. అర్ధరాత్రి 12 గంటలు దాటగానే కేకులు కట్ చేసి కొత్త సంవత్సరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. చర్చిల వద్ద క్రైస్తవులు నూతన సంవత్సర ఆరాధనలు చేశారు. బిర్యానీకి రెస్టారెంట్ల నిర్వాహకులు పలు ఆఫర్లు ప్రకటించారు.



ఓ హోటల్‌లో బిర్యానీ కౌంటర్ వద్ద కోలాహలం..


శ్రీకృష్ణావతారంలో దర్శనమిస్తున్న స్వామివారు

మనోహరం.. శ్రీ కృష్ణావతారం


కృష్ణావతారంలో ఉన్న భద్రాద్రి రామయ్యకు తిరువీధి సేవ నిర్వహిస్తున్న భక్తులు, అర్చకులు


గ్రామోత్సవంలో కోలాటం ఆడుతున్న భక్తులు

- వైభవోపేతంగా ఊంజల్‌సేవ
- నేడు తిరుమంగై ఆళ్వార్ పరమపదోత్సవం

భద్రాచలం: ముగ్ధమనోహరమైన రూపం.. చూడచక్కని ఆకారం.. కిరీటంపై నెమలి ఈకలతో చెంతనే సీతామహాదేవి, పక్కనే లక్ష్మణస్వామితో బంగారపు ఊయలలో ఊగుతున్న శ్రీకృష్ణావతారంలో ఉన్న భద్రాద్రి రామయ్యకు భక్తులు నీరాజనం పలికారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా రామాలయంలో జరుగుతున్న పగల్‌పత్తు వేడుకల్లో స్వామివారు శనివారం శ్రీకృష్ణావతారంలో దర్శనం ఇవ్వడంతో అవతారాలు ముగిశాయి. తొలుత ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కిట్టయ్యకు ఘనంగా ఊంజల్ సేవ

స్వామివారి అవతారాల్లో భాగంగా శ్రీ కృష్ణాలంకరణలో ఉన్న రామయ్యకు వైభవోపేతంగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్థాన విద్వాంసులు కీర్తనలు ఆలపిస్తుండగా ఆలయ అర్చకులు శ్రీకృష్ణుడైన రామయ్యను ఊయలలో ఊపుతూ వేదమంత్రాలు పఠించారు. అనంతరం హారతి సమర్పించారు. డోలోత్సవంలో పాల్గొని స్వామివారిని చూసి తరించిన భక్తులకు వెయ్యి అశ్వమేధయాగ ఫలాలకు దక్కినంత పుణ్యం వస్తుందని, సర్వపాపాలు తొలగి సుఖసంతోషాలు కలుగుతాయని వేద పండితులు వివరించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి వెన్న, అటుకులు, బెల్లం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం రామ నామ స్మరణలతో మార్మోగింది. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తజనంతో పండుగ శోభ సంతరించుకుంది. అనంతరం కోలాటాలు, మేళతాళాలు నడమ స్వామివారిని ఊరేగింపుగా మిథిలా స్టేడియానికి తీసుకొచ్చి వేదికపై ఆశీనులు చేశారు. భక్తుల దర్శనార్థం తిరువీధి సేవ నిర్వహించారు. అస్థాన మండపంలో స్వామి వారికి దర్బార్ సేవ, ఆరాధన, నివేదన ఇచ్చి పవళింపు సేవ జరిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలిలా..

- ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు సేవాకాలం, తిరుమంగై ఆళ్వార్ పరమపదోత్సవం
- మధ్యాహ్నం 1 నుంచి 2 వరకు రాజభోగం, శాత్తు ముర్రై, పూర్ణ శరణాగతి సేవ, పగల్‌పత్తు సమాప్తి
- మధ్యాహ్నం 3 గంటలకు దర్బారుసేవ
- సాయంత్రం 4 నుంచి 5 వరకు స్వామి వారిని ఊరేగింపుగా గోదావరి నది వద్దకు చేర్చుట
- సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు హంస వాహనంపై తెప్పోత్సవం

తెప్పోత్సవం రోజునే..

శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఆదివారం తిరుమంగై ఆళ్వార్ పరమపదోత్సవం జరగనుంది. రామాలయంలోని ఆస్థాన మండపంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. తిరుమంగై ఆళ్వార్ స్వామి వారి పాదాల చెంత పరమపదించి, అనంతరం స్వామివారి అనుగ్రహంతో జీవం పోసుకుంటారు. ఈ నేపథ్యంలోనే ప్రతీ ఏటా తెప్పోత్సవం రోజు ఆలయంలో ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీ.

ప్రత్యేక కార్యాచరణతో సమగ్రాభివృద్ధి

ప్రభుత్వ విప్ రేగా కాంతారావు


రేగా కాంతారావు

బూర్గంపాడు: జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. సీఎం కేసీఆర్ జిల్లా సమగ్రాభివృద్ధికి వేల కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నారని అన్నారు. జిల్లాను వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో ముందువరుసలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి చొరవతో జిల్లాకు మెడికల్, మణుగూరులో పాలిటెక్నిక్ కళాశాలలు సాధించుకున్నామని తెలిపారు. జిల్లాలోని మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యాలను మెరుగుపరిచేందుకు వందల కోట్ల రూపాయలతో పనులు జరుగుతున్నాయని, సాగునీటి వసతులను మెరుగుపరిచేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు మంజూరు చేస్తున్నామని అన్నారు. సీతారామ సాగర్‌తో జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. 'మన ఊరు -మన బడి'తో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయని, రైతుబంధు, రైతుబీమా, నిరంతర ఉచిత విద్యుత్ సరఫరాతో వ్యవసాయరంగం ముందుకు సాగుతోందని వివరించారు. 2023లో జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుందని చెప్పారు.

జిల్లా లీగల్ సర్వీసెస్ సెక్రటరీగా భానుమతి


భానుమతి

కొత్తగూడెంటౌన్: జిల్లా లీగల్ సర్వీసెస్ ఆథారిటీ సెక్రటరీగా కొత్తగూడెం జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.భానుమతిని నియమించారు. ఈ మేరకు శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బానుమతిని న్యాయవాదుల సంఘం నాయకులు అభినందించారు. జిల్లాకు లీగల్ సర్వీసెస్ ఆథారిటీ సెక్రటరీని నియమించడం ద్వారా ప్రజలకు సత్వర న్యాయం జరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుబ్రోలు రాంప్రసాద రావుతో పాటు భాగం మాధవ రావు, మునిగడప వెంకటేశ్వర్లు, మహ్మద్ సాదిక్ పాషా, ఆర్తిమక్కడ్, కన్నెగంటి శ్రీధర్, గాదె సునంద, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోసాని రాధాకృష్ణమూర్తి, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఏవూరి బాబురావు తదితరులు అభినందించారు.

అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేయాలి

డీఏఓ అభిమన్యుడు


లక్ష్మీపురంలో పత్తి పంటను పరిశీలిస్తున్న అభిమన్యుడు

బూర్గంపాడు: అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంట సాగు చేస్తే దిగుబడి ఎక్కువగా సాధించవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి కొర్సా అభిమన్యుడు అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీపురంలో శనివారం ఆయన పత్తిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ఏడాది జిల్లాలో కొందరు రైతులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తిని సాగు చేశారని, తద్వారా అధిక దిగుబడులు సాధిస్తున్నారని చెప్పారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రతి ఏటా పంటమార్పిడి చేస్తే చీడపీడలు తగ్గుతాయని, దిగుబడి కూడా పెరిగే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శంకర్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

5న 'డయల్ యువర్ ఎస్పీ'

కొత్తగూడెంటౌన్: జనవరి 5న డయల్ యువర్ ఎస్పీ(ప్రజావాణి) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెల 1వ తేదీన నిర్వహించే ఈ కార్యక్రమాన్ని నూతన సంవత్సరం, ముక్కోటి ఉత్సవాల కారణంగా 5వ తేదీన మధ్యాహ్నం 11.30 నుంచి 12.30 ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలు తెలియజేయాలని కోరారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలతో... ఉత్తమ విద్య, క్రమశిక్షణకు చిరునామా... మన విద్యాలయాలు

చదువుల గుమ్మం

- ఖమ్మం నగరంలో వెలిసిన విద్యాసంస్థలు
- ఇక్కడే చదువుకుని ఉన్నత స్థానాల్లో రాణిస్తున్న విద్యార్థులు
- పరీక్షల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో సత్తా చాటుతున్న వైనం

ఖమ్మంసహకారనగర్ : నగరం చదువుల గుమ్మంగా మారింది. విద్యలో రాణించాలనే తపన ఉన్న విద్యార్థులకు ఖమ్మం మంచి కేంద్రంగా చెప్పవచ్చు. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఇక్కడే విద్యను పూర్తి చేసే వెసులుబాటు నగరంలో ఉంది. ప్రభుత్వ కళాశాలలతోపాటు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు నగరంలో అనేకం విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఏడాది పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ పరీక్షల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధిస్తూ నగర కీర్తిని ఇనుమడింపచేస్తున్నారు. ఒకటి నుంచి పది ర్యాంకులలోపు నగరానికి చెందిన విద్యార్థులు ఉంటుండటం గర్వకారణంగా విద్యావేత్తలు అభివర్ణిస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచి బలమైన పునాది కలిగిన విద్యాసంస్థలు ఉండటం విశేషం. ఎల్‌కేజీ నుంచి విద్యార్థులకు సబ్జెక్టులపై పూర్తి అవగాహన కలిగిస్తూ విద్యాబోధన చేస్తున్నారు. సులభమైన రీతిలో అర్థమయ్యేలా బోధన సాగుతుండటంతో విద్యార్థులకు అంతగా ఇబ్బందులు తలెత్తడం లేదు. ప్రతి రోజు పాఠాలను బోధించడంతపాటు రివిజన్ కూడా చేయించడంతో విద్యార్థులు పరీక్షల సమయంలో కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా సులవుగా రాయగలుగుతున్నారు. పది, ఇంటర్, డిగ్రీ విద్యార్థులపై కళాశాలలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నాణ్యమైన విద్యను అం దించేందుకు కృషి చేస్తున్నాయి. అనుభవం ఉన్న ఫ్యాకల్టీతో విద్యాబోధన సాగిస్తున్నారు. ప్రతి ఏటా విద్యార్థులు టెన్త్, డిగ్రీలలో ర్యాంకుల పంట సాగిస్తున్నారు. ఇక్కడే చదువుకున్న అనేక మంది విద్యార్థులు ఇప్పుడు దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా మంచి కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. విద్యార్థుల ఉన్నతిలో నగరంలోని ప్రైవేట్ కళాశాలల పాత్ర ఎంతో ఉంది. ఖమ్మంలో విద్యాసంస్థల్లో చదివితే జీవితంలో స్థిరపడవచ్చనే భావన ప్రతి ఒక్కరిలో నెలకొంది. దీంతో అనేక ప్రాంతాల నుంచి కేవలం పిల్లల చదువుల కోసమనే నగరంలో స్థిరపడిన వారు మనకు చాలా మంది కనిపిస్తారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తమ పిల్లలకు మంచి చదువులు అందించాలనే ఆలోచనతో ఇక్కడే కిరాయికి ఇళ్లు తీసుకుని పిల్లలను పాఠశాలల్లో, కళాశాలల్లో చదివించుకుంటున్నారు. ఈ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు మంచి చదువును అందించడంతోపాటు ఇతర రంగాల్లో కూడా రాణించేలా కృషి చేస్తున్నాయి. విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లో వారిని ప్రోత్సహిస్తున్నాయి. ఇంటర్ కాలేజీ క్రీడాపోటీల్లో ప్రతి కళాశాల విద్యార్థులు పాల్గొంటూ రాణిస్తున్నారు. అలాగే సైన్స్‌ఫేర్, క్విజ్ వంటి వాటిల్లోనూ విద్యార్థులు తమ ప్రతిభను కనపరుస్తున్నారు.

ఉత్తమ విద్యకు శ్రీనగర్ రెజొనెన్స్ స్కూల్

విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తేవడంతోపాటు నూతన ఆవిష్కరణలకు ముఖద్వారంగా విలువలతో కూడిన విద్యను అందించేందుకు ఖమ్మం గుమ్మానికి శ్రీనగర్ రెజొనెన్స్ స్కూల్ కేంద్రంగా ఉందని విద్యాసంస్థల ఫౌండర్ కొండా శ్రీధర్ రావు అన్నారు. అనుభవజ్ఞులు, నిష్టాతులైన ఉపాధ్యాయ బృందాన్ని సమకూర్చుకుని, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ వారిలోని అంతర్గత, వ్యక్తిగత నైపుణ్యాలను వెలికి తీయడానికి పాఠ్య, సమపాఠ్య కార్య క్రమాలను మేళవించి బోధిస్తున్నామని తెలిపారు. రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్‌లో ఐఐటీ మెడికల్ ఫౌండేషన్‌ను ఆధునిక పద్ధతులలో బోధిస్తూ వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ శారీరక దృఢత్వానికి చక్కటి ఆటలకు విశాలమైన మైదానాన్ని, సంగీతం కోసం మ్యూజిక్ జోన్‌ను, ఒత్తిడి తగ్గించి. ఏకాగ్రతను పెంచేందుకు యోగాను, అద్భుతమైన కంప్యూటర్ ల్యాబ్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జాతీయస్థాయి ఒలంపియాడ్‌లో జాతీయ ర్యాంకు లను, రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రథమ బహుమతులు, ఇన్‌స్పైర్ అవార్డులను సాధించామని తెలిపారు.

అంతర్జాతీయ స్థాయి విద్యాబోధనతో ఢిల్లీ పబ్లిక్‌స్కూల్

ఖమ్మంసహకారనగర్ : నగరంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన చేస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపల్ కె.స్వప్న తెలిపారు. నర్సరీ నుంచి 8వ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్కూల్‌లో డ్యాన్స్, మ్యూజిక్ రూమ్స్, ఆర్ట్, క్రాఫ్ట్ రూమ్స్, అవుట్‌డోర్, ఇండోర్ స్పోర్ట్స్ సదుపాయాలు ఉన్నట్లు వివరించారు. సహజ పద్ధతి, సీబీఎస్ఈ కరిక్యులమ్‌లో బోధన చేస్తున్నట్లు తెలిపారు. అలాగే వైఫై సౌకర్యం ఉంటుందని, జర్మనీ, స్పానిష్ లాంగ్వేజీలు నేర్పుతున్నట్లు తెలిపారు. మెడికల్, ఐఐటీ ఫౌండేషన్ ప్రోగ్రాంలో శిక్షణ ఉంటుందని, వీటితోపాటు వచ్చే ఏడాది నుంచి హార్స్ రైడింగ్, క్రికెట్ నెట్ ప్రాక్టీస్, స్కేటింగ్ రింక్, రన్నింగ్ ట్రాక్, రోబోటిక్స్, కోడింగ్ లలో ప్రత్యేక చిక్షణా క్లాసులు కూడా ఉటాయని తెలిపారు. క్వాలిఫైడ్, అనుభవం ఉన్న టీచర్లతో విద్యాబోధన, కంప్యూటర్, లాంగ్వేజ్ ల్యాబ్, 4 ఎకరాల సువిశాల పచ్చటి క్యాంపస్‌లో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన సాగిస్తామని వివరించారు. చిన్నారుల్లో దాగి ఉండే సృజనాత్మకతను వెలికితీసే వేదికగా తమ విద్యాసంస్థలు వెలుగొందుతున్నాయని తెలిపారు. డిజిటల్ బోర్డులు, అత్యంత ఆధునిక ఏసీ క్లాసరూమ్‌ల ద్వారా విద్యాబోధన తమ ప్రత్యేకతగా పేర్కొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో న్యూఇరా బోధన

ఖమ్మంసహకారనగర్ : నగరంలోని మమత రోడ్డులో ఉన్న న్యూఇరా పాఠశాలలో ఆధునిక పద్ధతుల్లో స్టేట్, సీబీఎస్ఈల్లో విద్యాబోధన చేస్తున్నట్లు పాఠశాల చైర్మన్ ఐ.వి.రమణారావు, డైరెక్టర్ డాక్టర్ పి.భూమేశ్వరరావు తెలిపారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, హైస్కూల్ అన్ని చోట్ల ఇంటిగ్రేటెడ్ సిలబస్‌తోపాటు 6వ తరగతి నుంచి విద్యార్థులకు ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్‌తో విద్యాబోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు. 5వేల పుస్తకాలతో విశాలమైన లైబ్రరీ, రీడింగ్ స్థాయి పెంచేందుకు అధునాతన పద్ధతిలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సీసీఈ పద్ధతికి అనుకూలంగా ప్రత్యేక ఏర్పాట్లతో సైన్స్ ల్యాబ్స్, ప్రాజెక్ట్ వర్క్‌తో టీచింగ్, క్షేత్రస్థాయి పరిశీలనకు ఏటా క్రమం తప్పకుండా స్టడీటూర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల మానసిక ఉల్లాసాన్ని పెంపొందించే విధంగా మ్యూజిక్, డ్యాన్స్, చెస్, యోగా, కరాటే, ఆర్ట్ మరియు క్రాఫ్ట్ వంటి వాటిపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అధునాతన వసతులతో బాలబాలికలకు వేర్వేరుగా హాస్టల్ వసతి కల్పించినట్లు చెప్పారు. ఆటపాటలకు విశాలమైన ప్లేగ్రౌండ్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అన్ని రకాల వసతులతో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. అధునాతన బిల్డింగ్, విశాలమైన క్లాస్ రూములు, విద్యార్థుల ప్రత్యేక క్లాసులు మరియు అనుభవం కలిగిన సీనియర్ అధ్యాపకులచే విద్యా బోధన చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది 10వ తరగతి పరీక్షలలో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు.

విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తుకు దిక్సూచి... మన విద్యాలయాలు. నూతన సంవత్సర శుభాకాంక్షలు - 2023

చరిత్ర తిరగరాస్తున్న హార్వెస్ట్ విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్:
నగరంలోని హార్వెస్ట్ జూనియర్ కళాశాల, హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో చరిత్రను తిరగరాస్తున్నారని సెక్రటరీ, కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి పేర్కొన్నారు. హార్వెస్ట్ విద్యా సంస్థలు నర్సరీ నుండి 12 వ తరగతి వరకు విద్యార్థులను తీర్చి దిద్దుతాయని తెలిపారు. హార్వెస్ట్ బోధనా పద్ధతి విద్యార్థుల సృజనాత్మక శక్తికి పదునుపెట్టి వారి ఆలోచనాశక్తిని పెంపొందిస్తుందన్నారు. ప్రతిరోజు కో కరిక్యులార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పీరియడ్స్ పిల్లల పఠనాశక్తిని పెంచుతాయని వివరించారు. జేఈఈ ,నీట్ వంటి జాతీయ పరీక్షలకు కాన్సెప్ట్ క్లారిటీ, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్ తోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రెండు కంప్యూటర్ లాబ్స్ ,ఫిజిక్స్ ,కెమిస్ట్రీ ,బయాలజీ లాబ్స్ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గతమూడు సంవత్సరాలుగా 15శాతం మంది విద్యార్థులు ఐఐటీ,ఎన్ఐటీలలో చేరుతున్నారని, 17 శాతం విద్యార్థులు మొదటి ప్రయత్నం లోనే మెడిసిన్ లో చేరుతున్నారు. విద్యార్థి విద్యా మంథన్‌లో రాష్ట్ర స్థాయికి 12 మంది విద్యార్థులు ఎంపికైనా, చెకుముకి రాష్ట్ర స్థాయి పోటీలో ప్రధమ స్థానం పొందినా ,వివిధ క్రీడలు,సాంస్కృతిక పోటీలలో రాష్ట్ర,జాతీయ పతకాలు సాధించినా అది హార్వెస్ట్ శిక్షణా సామర్థ్యానికి నిదర్శనం అన్నారు.

వైద్య విద్యకు రాచమార్గం భవిష్య మెడికల్ అకాడమి

ఖమ్మంసహకారనగర్: వైద్య విద్యలో ప్రవేశం కోసం విద్యార్థులకు రాచ మార్గంగా భవిష్య మెడికల్ అకాడమి ఉపయోగపడుతుందని అకాడమి మేనేజింగ్ డైరెక్టర్ బి.రామిరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎం.భాస్కరరావు తెలిపారు. నగరంలోని గట్టయ్యసెంటర్ లో ఉన్న నూతన కార్పొరేషన్ కార్యాలయానికి ఎదురుగా ఈ అకాడమి ఉందని, ఇక్కడ డే అండ్ రెసిడెన్షియల్ అవకాశం ఉందని పేర్కొన్నారు. దాదాపు 25 ఏళ్లకు పైగా కార్పొరేట్ కళాశాలల్లో బోధించిన అనుభవం ఉన్న విజయవాడ అధ్యాపకులు డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. మెడికల్ సీటు సాధనే లక్ష్యంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సెక్షన్‌కు 35 మందికి విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉన్నట్లు వివరించారు. నీట్‌లో లాంగ్‌టర్మ్ కోచింగ్ ఉంటుందని తెలిపారు. ఈ ప్రాంత విద్యార్థులు నీట్ శిక్షణ కోసం సుదూర ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన అవసరం లేకుండా ఖమ్మంలోనే నీట్ అకాడమిని స్థాపించినట్లు తెలిపారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులపై ప్రత్యేక శిక్షణ ఉంటుందని చెప్పారు.
దూర ప్రాంత విద్యార్థులకు క్వాలిటీ మెనుతో చక్కని ఇంటి వాతావరణాన్ని మైమరిపించే హాస్టల్ సదుపాయం.

విజ్ఞానాన్ని పెంచే విద్య నిర్మల్ హృదయ్ ప్రత్యేకత

విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంచొందించేలా విద్యాబోధన చేయడం నిర్మల్ హృదయ్ హైస్కూల్ ప్రత్యేకత అని ఫౌండర్ చైర్మన్ వంగా సాంబశివరెడ్డి, ప్రిన్సిపల్ వంగా పద్మ తెలిపారు. విద్యార్థులకు మంచి విద్యను అందించడంతోపాటు వారిలో సామాజిక బాధ్యతను పెంపొందించేలా కృషి చేస్తామని తెలిపారు. యువతలో సృజనాత్మక, యాక్టివ్ ఆలోచనా ప్రైమరీ, ప్రీ ప్రైమరీ తరగతులకు ప్రత్యేక క్యాంపస్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిజిటల్ తరగతులు, విశాలమైన తరగతిగదులు, విద్యార్థులు ఉల్లాసంగా ఆడుకునేందుకు వీలుగా ప్లేగ్రౌండ్, కంప్యూటర్ ల్యాబ్, రవాణ సౌకర్యం ఉన్నట్లు వివరించారు.

వికాస్ లో వ్యక్తిగత శ్రద్ధతో బోధన

ఖమ్మంసహకారనగర్ : నగరంలోని వీడీవోస్ కాలనీలో ఉన్న వికాస్ స్కూల్‌లో విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధతో విద్యాబోధన చేస్తామని స్కూల్ ప్రిన్సిపాల్ వై.లావణ్య అన్నారు. గతంలో ప్రిన్సిపాల్‌గా పని చేసిన అనుభవంతో వికాస్ స్కూల్ ప్రారంభించినట్లు తెలిపారు. నైపుణ్యం, అనుభవం ఉన్న ఉపాధ్యాయులు, సిబ్బందితో విద్యాబోధన చేస్తున్నామని, ప్రతి విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. చిన్నతనంనుంచే సాంకేతిక విద్యపై అభిరుచి కలిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. థీమ్ కాన్సెప్ట్‌తో బోధన చేపడుతున్నట్లు తెలిపారు.

ఏ విద్యార్థితోనైనా విశిష్ట ఫలితం బ్లోసమ్స్ ప్రత్యేకత

ఖమ్మంసహకారనగర్ : విద్యార్థి ఏ స్థాయిలో ఉన్నా విశిష్ట ఫలితాలను సాధించడమే బ్లోసమ్స్ ప్రత్యేకత అని ఆ స్కూల్ కరస్పాండెంట్ నలజాల రుక్మిణి అన్నారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను తమ స్కూల్ సాధించినట్లు వివరించారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కరోనా తర్వాత విద్యార్థులు విద్యపై తక్కువ శ్రద్ధ కలిగి ఉన్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని తమ పాఠశాలలో ప్లే-వే మెథడ్‌లో విద్యాబోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు. మల్టీమీడియా, ఆచరాణాత్మకమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల పదో తరగతిలో 10 జీపీఏ పాయింట్లు, 100 శాతం ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు.

విద్యతోపాటు ఆట పాటల యందు గూగుల్‌కిడ్స్ ముందంజ

ఖమ్మంసహకారనగర్ : నగరంలోని గూగుల్ కిడ్స్ ప్రైమరీలో విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో ముందుకుపోతున్నదని స్కూల్ కరస్పాండెంట్ అనుమోలు కృష్ణప్రసాద్, డైరెక్టర్ ఆర్. శ్రీనివాస గుప్తా పేర్కొన్నారు. ఈ స్కూల్‌లో నూతన విద్యా ప్రమాణాలు, అనుభవజ్ఞులైన టీచర్లతో విద్యాబోధన, తరగతి గదిలో పరిమిత సంఖ్యలో విద్యార్థులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి తరగతిలోసీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. విద్యతోపాటు స్కూల్‌లో డ్యాన్స్, కరాటే, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్‌ను విద్యార్థులతో ఆడిస్తున్నట్లు తెలిపారు.

విజయకేతనం ఎగురవేస్తున్న తెలంగాణ నారాయణ

ఖమ్మంసహకారనగర్ : ప్రతి ఏడాది పదో తరగతి ఫలితాల్లో తెలంగాణ నారాయణ విద్యార్థులు విజయకేతనం ఎగురవేస్తున్నారని స్కూల్ డైరెక్టర్లు గన్నవరపు చంద్రశేఖర్, కొదుమూరు నాగపవన్ తెలిపారు. సీనియర్ ఫ్యాకల్టీతో అత్యుత్తమ బోధన పద్ధతులతో విద్యార్థులకు బోధిస్తున్నట్లు చెప్పారు. నీట్‌లో ఎనిమిది మంది, జేఎన్‌టీయూలో ఆరుగురు, ఎన్ఐటీలో ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పేర్కొన్నారు. 2019లో ఐఐటీ రామయ్యలో 10 మంది, 2018లో 10మంది ఎంపికయ్యారని వివరించారు. 2019 లో 70శాతం కంటే ఎక్కువ మంది విద్యార్థులకు తొమ్మిది పాయింట్లకు పైగా జీపీఏ సాధించినట్లు తెలిపారు.

విద్యార్థుల ఉన్నతికి లిటిల్ ఫ్లవర్ పట్టుకొమ్మ

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు లిటిల్ ఫ్లవర్ స్కూల్, కళాశాలలు పట్టుకొమ్మల్లా ఉపయోగపడుతున్నాయని విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి శ్రీనివాస వరప్రసాద్, రమేష్‌బాబు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో గత 30 సంవత్సరాలుగా విద్యారంగంలో విశేషమైన విద్యను తమ విద్యా సంస్థలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఫౌండర్ మాగంటి సూర్యం అందించిన స్ఫూర్తితో విద్యాసంస్థలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నో రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి ర్యాంకులు సాధించి స్కూల్, కళాశాల్లో అత్యుత్తమ ర్యాంకులు తమ విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

3 నుంచి హాస్టల్ వర్కర్ల నిరవధిక సమ్మె


ఐటీడీఏ పీఓకు సమస్యలు విన్నవిస్తున్న నాయకులు

భద్రాచలంఅర్బన్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, కళాశాల అనుబంధ హాస్టళ్లలోని డైలీ వేజ్, ఔట్ సోర్సింగ్ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో 3వ తేదీ నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మచారి, హీరాలాల్ తెలిపారు. శనివారం ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు, డిప్యూటీ డైరెక్టర్ రమాదేవికి సీఐటీయూ ఆధ్వర్యాన వినతిపత్రాలు అందజేసి మాట్లాడారు. వేతనాల విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నకిరికంటి నాగరాజు, సంద్ర భూపేందర్ తదితరులు పాల్గొన్నారు.

20వ రోజు 1,184మంది హాజరు


శానిటేషన్ చేయిస్తున్న పోలీస్ సిబ్బంది

ఖమ్మంక్రైం : పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా చేపట్టిన దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు శనివారం 1,348మంది అభ్యర్థులకు గాను 1184మంది ఈవెంట్లకు హాజరయ్యారని సీపీ విష్ణు ఎస్.వారియర్ వెల్లడించారు. ఇందులో 696మంది అభ్యర్థులు తుది పరీక్షలకు అర్హత సాధించారని తెలిపారు. కాగా, అభ్యర్థుల ఆరోగ్య భద్రత దృష్ట్యా బయో టాయిలెట్ల వద్ద ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మొట్లగూడెంలో ఘర్షణ

నలుగురికి గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ మొట్లగూడెం గ్రామంలో శనివారం రాత్రి గ్రామస్తుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... గ్రామంలో రాత్రి వేళలో విద్యుత్ సరఫరా నిలిపివేసిన ఘటనలో అనుమానించిన ఇద్దరిని గ్రామస్తులు ప్రశ్నించి మందలించారు. దీన్ని అవమానంగా భావించిన రాజశేఖర్ అనే యువకుడు కత్తితో గ్రామస్తులపై దాడికి పాల్పడ్డాడు. దీంతో కుమార్, నరేష్, లింగరాజు, సుధీర్ అనే వ్యక్తులకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం స్థానికులు ఇల్లెందు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు దాడికి పాల్పడిన రాజశేఖర్‌తోపాటు కోరం కమల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

రాజ్యాంగపరంగా వ్యవహరించాలి..

ఖమ్మంమయూరిసెంటర్: పురాణ కథను విమర్శించినందుకు గాను నాస్తికవాది బైరి నరేశ్‌ను అరెస్ట్ చేయడం గర్హనీయమని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పేర్కొన్నారు. ఇది భావ ప్రకటన స్వేచ్ఛను హరించే చర్యగా భావిస్తున్నామని, ఎవరైనా సరే రాజ్యాంగపరంగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ మతోన్మాదులు, మనువాదులకు లొంగిపోయిందని ఆయన శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆరోపించారు.

బొగ్గు ఉత్పత్తిలో ముందంజ

- జిల్లాలో లక్ష్యానికి మించి వెలికితీత
- వివరాలు వెల్లడించిన సింగరేణి జీఎంలు



సింగరేణి హెడ్డాఫీస్ (ఇన్‌సెట్) వెలికితీసిన బొగ్గు

సింగరేణి వ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తిలో జిల్లాలోని మణుగూరు, ఇల్లెందు ఏరియాలు ముందంజలో నిలిచాయి. డిసెంబర్‌లో నిర్దేశిత లక్ష్యానికి మించి మణుగూరులో 123 శాతం, ఇల్లెందులో 104 శాతం ఉత్పత్తి సాధించాయి. కొత్తగూడెంలోనూ 98 శాతం ఉత్పత్తి నమోదయింది. ఉత్పత్తి చేసిన బొగ్గును వినియోగదారులకు రవాణా చేయడంలోనూ ఉత్తమ ప్రగతి చూపాయి.

● మణుగూరులో 123 శాతం..

మణుగూరుటౌన్ : డిసెంబర్ నెలలో మణుగూరు ఏరియా 123 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా జీఎం జి.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డిసెంబర్‌లో సింగరేణి వ్యాప్తంగా మణుగూరు ఏరియాలోనే అత్యధిక ఉత్పత్తి సాధించామని చెప్పారు. 10.37 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కాగా, 12.75 లక్షల టన్నులు ఉత్పత్తి చేశామని తెలిపారు. ఏడాది వార్షిక లక్ష్యంలోనూ ఇప్పటి వరకు 84.51 లక్షల టన్నులకు 91.39 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి(108 శాతం) సాధించామని వివరించారు. ఓవర్ బర్డెన్ 15 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 15.53లక్షల క్యూబిక్ మీటర్లు వెలికితీశామని తెలిపారు. ఈ ఏడాది వార్షిక లక్ష్యంలోనూ 103.74 క్యూబిక్ మీటర్లు తీసి 82 శాతం సాధించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో అధికారులు ఎస్.రమేష్, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసాచారి, షబ్బీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లెందులో 104 శాతం..

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో 104 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని జీఎం షాలేమురాజు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో డిసెంబర్ నెల ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. డిసెంబర్ నెల లక్ష్యం 4.77లక్షల టన్నులు కాగా 4.96 లక్షల టన్నులు ఉత్పత్తి చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 36.45 లక్షల టన్నుల లక్ష్యానికి 35.94 టన్నుల బొగ్గు ఉత్పత్తి వెలికి తీసి, 99 శాతం నమోదు చేశామని వివరించారు. 5.53 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు తెలిపారు. వచ్చే ఏప్రిల్‌లో జేకే ఓసీ విస్తరణ ప్రారంభమవుతుందని, మహబూబాబాద్ రోడ్‌లో హైలెవల్ బ్రిడ్జిల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయని వివరించారు. అధికారులు ఎం.గిరిధర్‌రావు, సాయి స్వరూప్ తదితరులు ఉన్నారు.

● కొత్తగూడెంలో 98 శాతం..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో డిసెంబర్‌లో 14.01 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా, 13.67 లక్షల టన్నులు సాధించినట్లు ఏరియా జీఎం జక్కం రమేష్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జీఎం వివరాలు వెల్లడించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో గడిచిన 9 మాసాల్లో 99.41 లక్షల టన్నుల లక్ష్యానికి 87.69 లక్షల టన్నుల బొగ్గు వెలికితీసి 88 శాతం సాధించామని వివరించారు. రోడ్డు, రైలు మార్గం ద్వారా 14.31 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు పేర్కొన్నారు. పీవీకే–5షాఫ్ట్ గనిలో డిసెంబర్ నెలలో 41 వేల టన్నుల లక్ష్యానికి 22 వేల టన్నులు మాత్రమే సాధించి వెనుకంజలో ఉందని, గని 330 మీటర్ల లోతులో బొగ్గు ఉత్పత్తి జరుగుతున్న నేపథ్యంలో ఇటీవల చిన్న, చిన్న ప్రమాదాలు జరిగాయని వివరించారు. వీకే–7షాఫ్ట్ గనికి వచ్చే ఫిబ్రవరిలో అనుమతులు వస్తాయని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు సంస్థ క్వార్టర్లను ఖాళీ చేయకపోతే పీనల్ రెంట్‌తో పాటు బెనిఫిట్స్ నిలిపివేస్తామని అన్నారు. అధికారులు వెంకటేశ్వరరావు, రమేష్, బూర రవీందర్, సూర్యనారాయణ, సామ్యేల్ సుధాకర్, శ్రీకాంత్, కిరణ్‌బాబు, రమణారెడ్డి, మురళి పాల్గొన్నారు.

10వ తేదీలోగా మన ఊరు–మన బడి పనులు

- రాష్ట్రంలో 9,123 పాఠశాలల ఎంపిక
- పనుల్లో భద్రాద్రి జిల్లాకు మూడోస్థానం
- టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి


ఇల్లెందు రూరల్ : అధికారులకు సూచనలు చేస్తున్న రావుల శ్రీధర్‌రెడ్డి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈనెల 10వ తేదీ నాటికి ప్రతీ మండలంలో ఎంపిక చేసిన రెండు పాఠశాలల్లో మన ఊరు – మన బడి పనులు పూర్తిచేయాలని రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్(టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి సూచించారు. భద్రాద్రి జిల్లాకు శనివారం వచ్చిన ఆయన కలెక్టరేట్‌లో మన ఊరు–మన బడి పనులపై విద్య, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించడమే లక్ష్యంగా మన ఊరు– మన బడి కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. రాష్ట్రంలో మొదటి విడతగా 9,123 పాఠశాలలను ఎంపిక చేయగా, దాదాపు రూ.9 వేల కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నట్లు వివరించారు. జనవరి 7లోగా ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టనున్న అన్ని పనులు గ్రౌండింగ్ పూర్తి చేయాలని తెలిపారు. కాగా, పనులకు నిధుల కొరత లేనందున నాణ్యత పాటించాలని స్పష్టం చేశారు. ఇక జిల్లా పనుల పురోగతిలో రాష్ట్రస్థాయిలోనే మూడో స్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడతగా 368 పాఠశాలలను ఎంపిక చేసి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.

పాఠశాలల్లో సౌకర్యాల మెరుగుకు కృషి

ఇల్లెందురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం మన ఊరు – మన బడి పథకం ద్వారా కృషి చేస్తోందని టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఇల్లెందు మండలం సంజయ్‌నగర్, పట్టణంలోని స్టేషన్‌బస్తీ ప్రాథమికోన్నత, ఉర్దూ మీడియం పాఠశాలల్లో శనివారం ఆయన మన ఊరు – మన బడి కార్యక్రమం పనులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున, ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. కనీసం పక్షం రోజులకోసారైనా పాఠశాల మొత్తం శుభ్రం చేసేలా స్థానిక సంస్థల సహకారం తీసుకుంటూ, మరిన్ని సౌకర్యాల కల్పనకు దాతల చేయూత కోరాలని శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఈఈ సురేష్, డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, ఆర్‌అండ్‌బీ ఏఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడాలి


రికార్డులను పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి

బూర్గంపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని టీఎస్ ఈడబ్ల్యూడీఎస్ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి సూచించారు. అంజనాపురం మండల పరిషత్ పాఠశాలలో శనివారం ఆయన మన ఊరు– మన బడి కార్యక్రమం పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తిచేయించుకున్న ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పిస్తున్న పరిస్థితుల్లో విద్యా ప్రమాణాలను మరింతగా పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సోమశేఖర శర్మ, సెక్టోరియల్ అధికారులు నాగరాజు, శేఖర్, సైదులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో 'సహకార మిత్ర'

- డిపాజిట్లపై 7.5 శాతం వడ్డీ సౌకర్యం
- ఆర్థిక లావాదేవీల్లో రాష్ట్రంలోనే రెండో స్థానం
- వెల్లడించిన చైర్మన్ కూరాకుల నాగభూషణం


సహకార మిత్ర బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న చైర్మన్ నాగభూషణం, పక్కన సీఈఓ, జీఎం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)లో కొత్తగా పరిమిత కాలంతో కూడిన 'సహకార మిత్ర' డిపాజిట్ పథకాన్ని ప్రవేశ పెడుతున్నట్లు చైర్మన్ కూరాకుల నాగభూషణం తెలిపారు. ఖమ్మంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. డిపాజిట్లపై అత్యధిక వడ్డీలను అందించేలా సహకార మిత్ర డిపాజిట్ల సేకరణ మహోత్సవాన్ని 333 రోజుల పథకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద సాధారణ వ్యక్తులకు 7.50 శాతం వడ్డీ, సీనియర్ సిటిజన్లకు 8 శాతం వడ్డీ అందుతుందని చెప్పారు. కాగా, ఖమ్మం డీసీసీబీ రూ.2,681.95 కోట్ల లావాదేవీలతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందని వెల్లడించారు. బ్యాంక్ డిపాజిట్లు రూ.1,013.78 కోట్లు, రుణాలు రూ.1,668.17 కోట్లుగా నమోదయ్యాయని చైర్మన్ తెలిపారు. మార్చిలో ముగియనున్న ఆర్థిక సంవత్సరం నాటికి బ్యాంక్ టర్నోవర్ రూ.3 వేల కోట్లను చేరుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

సాగుకు రూ.380 కోట్ల రుణాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.680 కోట్ల వ్యవసాయ రుణాలు, బంగారం రుణాలు రూ.359.89 కోట్లు ఇచ్చామని చైర్మన్ నాగభూషణం తెలిపారు. చదువుల నిమిత్తం విదేశాలకు వెళ్లే 209 మంది విద్యార్థులకు రూ.26 కోట్లు, 500 మందికి కర్షక మిత్ర మార్టిగేజ్ రుణాలు రూ.48 కోట్లు, చిన్న పరిశ్రమలకు పీఎంఈజీపీ కింద రూ.10 కోట్లు, గృహ నిర్మాణాలకు రూ.4 కోట్లు అందించామని చెప్పారు. కాగా, గృహ రుణం రూ.75 లక్షల వరకు, మార్టిగేజ్ రుణాలు రూ.40 లక్షల వరకు, మల్టీపర్పస్ రుణాలు రూ.30 లక్షల వరకు, వాహన మిత్ర రుణాలు రూ.25 లక్షల వరకు, కర్షక మిత్ర రుణాలు రూ.10 లక్షల వరకు, ఎస్ఎంఈ ఫైనాన్స్ రూ.5 లక్షల వరకు, తత్కాల్ ఓవర్ డ్రాఫ్ట్ రూ.50 వేల వరకు ఇస్తుందని తెలిపారు. కాగా, సహకార సంఘాల ఉద్యోగులకు మానవ వనరుల పాలసీని అమలు చేస్తుండడంతో ఉద్యోగ భద్రత ఉంటుందని తెలిపారు. సమావేశంలో బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.నర్మద, జనరల్ మేనేజర్ పద్మావతి పాల్గొన్నారు.

హమాలీ కార్మికుడికి గాయాలు

పాల్వంచరూరల్: లారీలో ధాన్యం లోడ్ చేసి తాళ్లను బిగిస్తున్న క్రమంలో హమాలీకి ఇనుప రాడ్డు తగిలి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని సోములగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. రాత్రి వేళ 17 మంది హమాలీ కార్మికులు ధాన్యాన్ని లారీలో లోడ్ చేశారు. అనంతరం గన్నీ బ్యాగులు కిందపడిపోకుండా తాళ్లు కడుతుండగా బాలినేని మాధారావు అనే కార్మికుడిపై ఇనుప రాడ్డు వచ్చి పడింది. దీంతో తలకు గాయమైంది. తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. గాయమైన చోట కుట్లు వేశారు.

బస్సు కిందపడి వ్యక్తి మృతి

ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రమాదం

మణుగూరు రూరల్ : ప్రమాదవశాత్తు బస్సు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని సురక్షా(ఆర్టీసీ) బస్టాండ్ ప్రాంగణంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. భూపాలపల్లికి చెందిన జీదుల రాజ్ కుమార్ తన బంధువులను పలకరించేందుకు మణుగూరు వచ్చాడు. ఇంటికి తిరిగి వెళ్లేందుకు సురక్షా బస్టాండ్ చేరుకున్నాడు. బస్టాండ్‌లో బస్సు ఎక్కే ముందు సీటు ఆపుకునేందుకు కిటికీలో నుంచి రుమాలును సీటులో వేసే క్రమంలో ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. బస్సు ఒక్కసారిగా ముందుకు కదలడంతో టైర్ల కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడికక్కడే మృతి చెందాడు. మణుగూరు ఎస్సై రాజ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద వివరాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు


ప్రమాదంలో ధ్వంసమైన కారు

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం నగరం మామిళ్లగూడేనికి చెందిన వేములపల్లి కిషోర్ కుమార్ కుటుంబంతో కారులో భద్రాచలం నుంచి ఖమ్మం వెళ్తున్నాడు. ఈ క్రమంలో పడమటనర్సాపురం గ్రామంలో ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోగా, కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. అనంతరం ముందుకు దూసుకెళ్లి చెట్లను ఢీకొట్టింది. దీంతో స్తంభం, చెట్లు విరిగిపడ్డాయి. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులు కిషోర్ కుమార్, ఝాన్సీ రాణి, నవీన్ కుమార్‌లను చికిత్స నిమిత్తం స్థానికులు కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. ఏఎస్సై తిరుపతిరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్తంభం విరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

పాల్వంచరూరల్: యువతిని ప్రేమ పేరుతో వేధించిన కేసులో ఉన్న యువకుడు పురుగుల మందుతాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పట్టణ పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని యానంబైల్ గ్రామానికి చెందిన శిరసాని రోహిత్(21) గత నెల 29న పాల్వంచ పట్టణంలోని దమ్మపేట సెంటర్‌లో బంధువుల ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోగా, ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా వేధింపులకు గురైన యువతి ఈ నెల 29న డోర్నకల్‌లో ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై మృతురాలి తల్లిదండ్రులు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయగా, రోహిత్ భయపడి పురుగుల మందు తాగి చనిపోయాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ నరేష్ తెలిపారు.

అభివృద్ధితోపాటు సౌకర్యాలు కల్పిస్తాం

కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ రఘు


మున్సిపల్ కమిషనర్ రఘు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మున్సిపాలిటీలో నూతన సంవత్సరంలో మరింత ఆధునిక పద్ధతులను అనుసరిస్తూ అభివృద్ధి చేయడంతోపాటుగా, పట్టణ ప్రజలకు అన్ని రకాల సౌకర్యం కలిగే విధంగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రఘు తెలిపారు. కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన నూతన సంవత్సరంలో శ్రీకారం చుట్టనున్న కార్యక్రమాలపై 'సాక్షి'కి వివరించారు.

ప్ర: నూతన సంవత్సరంలో ఏఏ కార్యక్రమాలు చేపడుతున్నారు?

జ: కొత్తగూడెం మున్సిపాలిటీలో నూతన సంవత్సరం మొదటి వారంలో రైతుబజార్ పక్కన నూతన కూరగాయల మార్కెట్ పనులు ప్రారంభమయ్యే అవకాశముంది. ఈ మార్కెట్ రూ.కోటితో నిర్మాణం కానున్నది. ఇది పూర్తయితే చిరు వ్యాపారులకు, వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

ప్ర: పట్టణ పరిధిలోని ఓపెన్ స్థలాలను ఏ విధంగా వినియోగించుకుంటున్నారు?

జ: పట్టణంలోని ఓపెన్ స్థలాలను మినీ పార్కులు, ప్లేగ్రౌండ్స్ ఏర్పాటుకు వినియోగిస్తాం. ఇందుకు కోసం సర్వే సైతం జరిగింది. రానున్న రోజుల్లో ప్రజలకు ప్లే గ్రౌండ్స్ సౌకర్యవంతంగా మారతాయి. క్రీడలు, వాకింగ్, వివిధ రకాల స్పోర్ట్స్ జరిగేందుకు ఉపయోగపడుతాయి.

ప్ర: పట్టణంలో ఇంకా ఏమేమి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి?

జ: పట్టణంలోని సూపర్‌బజార్ సెంటర్ నుంచి సింగరేణి ఆస్పత్రి వరకు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. డివైడర్ పనులు కూడా చేపడతాం. రైల్వే అండర్ బ్రిడ్జిలో నీరు నిల్వకుండా చర్యలు చేపడుతున్నాం. పలు వార్డుల్లో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

ప్ర: ఆహ్లాదం కోసం పార్కుల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

జ: పట్టణ పరిధిలో ఉన్న రాజీవ్ పార్కులో ఆహ్లాదం అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. వార్డుల్లోని మినీ పార్కుల్లో కూడా ఆహ్లాదం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర: ఏ విధంగా స్వచ్ఛ పట్టణంగా మారుస్తారు?

జ: కొత్తగూడేన్ని స్వచ్ఛ పట్టణంగా మార్చేందుకు క్రమం తప్పకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు జరిగే విధంగా చూస్తున్నాం. ఫిర్యాదు అందగానే శానిటేషన్ విభాగం వారిని పంపించి సమస్య పరిష్కరిస్తున్నాం. ట్రాలీలతో ప్రతి ఇంటికీ వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. పట్టణం పరిశుభ్రంగా ఉండేలా చూస్తున్నాం.

ప్ర: కొత్త ఏడాది ఎలాంటి మార్పు తెస్తారు?

జ: నూతన సంవత్సరంలో పట్టణంలో మరింత అభివృద్ధి జరిగేలా చూస్తాం. మున్సిపాలిటీలో అన్ని రకాల పనులు నిర్దేశిత సమయంలోగా జరిగేలా చూస్తాం. ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పకుండా సమయానికి పనులు జరిగేలా చర్యలు తీసుకుంటాం.

ఇల్లెందులో నూతన కళ..

- అందుబాటులోకి మోడల్ మార్కెట్
- ట్యాంక్ బండ్ సుందరీకరణ..
- మున్సిపల్ కమిషనర్ అంకుషావళి


మున్సిపల్ కమిషనర్ అంకుషావళి

ఇల్లెందు: కొత్త సంవత్సరంలో కొత్త ప్రాజెక్టులతో ఇల్లెందు ప్రజల్లో నూతనోత్తేజం నింపుతామని మున్సిపల్ కమిషనర్ అంకుషావళీ పేర్కొన్నారు. 2023లో నూతనంగా చేపట్టనున్న కార్యక్రమాలను ఆయన 'సాక్షి'తో పంచుకున్నారు.

ప్రశ్న: కొత్త సంవత్సరంలో ఇల్లెందు ప్రజల ముంగిటకు వచ్చే కార్యక్రమం?

జవాబు: మోడల్ మార్కెట్, లేక్ వ్యూ పార్క్ పూర్తిచేసి కొత్తసంవత్సరంలో అందుబాటులోకి తెస్తాం. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి చేశాం. వచ్చే రెండు నెలల్లో అన్ని పనులు పూర్తిచేసి ప్రారంభిస్తాం. దీంతో పట్టణం నూతన కళ సంతరించుకుంటుంది.

ప్ర: ట్యాంక్ బండ్ సుందరీకరణ ఎలా సాగుతున్నాయి.?

జ: ట్యాంక్ బండ్ సుందరీకరణ పనులు వేగంగా సాగుతున్నాయి.చెరువులో బోటింగ్ కూడా ఏర్పాటుచేస్తాం. ప్రతిపాదనలు రూపొందించి టూరిజం శాఖకు పంపుతాం. ట్యాంక్ బండ్, లేక్ వ్యూ పార్క్ పక్కపక్కనే ఉండటం వల్ల పర్యాటకంగా కూడా అభివృద్ధి జరుగుతుంది.

ప్ర: మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం ఏ దశలో ఉంది..?

జ: త్వరలో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ పనులు కూడా పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం. దీని వల్ల పట్టణంలో ఫంక్షన్లకు మీటింగ్‌లకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. 90 శాతం పనులు పూర్తయ్యాయి.

ప్ర: ఇంకా ఎలాంటి పనులు చేపట్టనున్నారు?

జ: ప్రస్తుతం మోడ్రన్ దోభీ ఘాట్ నిర్మాణం చేపడతాం. ఇందుకోసం 19వ వార్డులో స్థలం కూడా సేకరించారు. మహబూబాబాద్ రోడ్‌లో నగర వాటిక ఏర్పాటు చేయబోతున్నాం. దీనికి ప్రభుత్వం నిధులు ఇస్తుంది. హిందూ శ్మశానవాటికలో రూ. 1.50 కోట్లతో చేపట్టిన పనులు కూడా 95 శాతం పూర్తయ్యాయి.

ప్ర: పట్టణంలో క్రీడాప్రాంగణాలు ఎన్ని ఉన్నాయి?

జ: రెండుచోట్ల క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశాం. మరో ఐదు అభివృద్ధి చేయనున్నాం. 17 పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేశాం. మరో రెండు సింగరేణి చేపడుతోంది.

ప్ర: ప్రజారోగ్యం పట్ల ఎలాంటి శ్రద్ధ తీసుకుంటున్నారు.

జ: ప్రజారోగ్యానికి పెద్దపీట వేశాం. శానిటేషన్ చర్యలు పక్కగా చేపడుతున్నాం. భవిష్యత్‌తో చెత్త లేని క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా ఇల్లెందు నిలుస్తుంది. బహిరంగ మలమూత్ర విసర్జన నిర్మూలన దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి. రోడ్లు, డ్రెయిన్లు, లైట్లు తదితర పనులు ఏఏ ప్రాంతంలో అవసరమో గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నాం. త్వరలో మున్సిపాలిటీకి మాస్టర్ ప్లాన్ వస్తుంది. ఈ దిశగా సర్వే పూర్తయింది.

క్లుప్తంగా

వితరణ



వాటర్ బాటిల్స్ అందజేస్తున్న శ్రీనివాస్

భద్రాచలంఅర్బన్: జిల్లా ఆర్య వైశ్య మహాసభ తరపున భద్రాద్రిలో నేడు, రేపు నిర్వహించే ముక్కోటి ఉత్సవాలకు వచ్చే యాత్రికుల సౌకర్యార్థం 5 వేల వాటర్ బాటిల్స్, 5 వేల బిస్కెట్ ప్యాకెట్లను శనివారం వితరణగా ఆర్డీఓ రత్న కళ్యాణికి అందజేశారు. మహాసభ సభ్యులు మరికొందరి దాతల సహకారంతో వీటిని సమకూర్చి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రత్నకళ్యాణి మాట్లాడుతూ ఆర్యవైశ్యమహాసభ జిల్లా అధ్యక్షులు చారుగుల్ల శ్రీనివాస్‌తో పాటు ఇతర సభ్యులు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పల్లెర్ల చంద్రశేఖర్, చింతల వినోద్ కుమార్, బండారు కృష్ణయ్య, నాళ్ల సాయిచంద్, ఆర్వపల్లి రాధాకృష్ణ, గూడుమాసు వెంకట సత్యనారాయణ, నాలం వెంటరాంభరత్, మూర్తి, మేడిచర్ల సత్య ప్రసాద్, చారుగుళ్ల వెంకట నాగభూషణం, సంకా కృష్ణార్జునరావు, మేడిచర్ల సత్య ప్రసాద్, చారుగుల వెంకట నాగభూషణం, సంకా కృష్ణార్జునరావు, బిక్కుమల్ల కృష్ణ చైతన్య, హర్ష, ఇల్లందుల వెంకటేశ్వర్లు, ఉడతా నగేష్ కుమార్, సురే వెంకట చెంచు సుబ్బారావు, తెనాలి కృష్ణ, రేపాక హరి తదితరులు పాల్గొన్నారు.

మాంటిస్సోరి ఆధ్వర్యంలో ..

మణుగూరు రూరల్ : మాంటిస్సోరి–శ్రీసత్య భాస్కర హైస్కూల్ ఆధ్వర్యంలో సీటైప్‌లోని బాలవెలుగు పాఠశాలలో శనివారం న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల పదో తరగతి విద్యార్థుల సహకారంతో చిన్నారులకు నిత్యావసరాలు, కూరగాయలు, బియ్యం, పండ్లను అందజేశారు. అనంతరం మాంటిస్సోరి ప్రిన్సిపాల్ ఐసక్ థామస్, బాలవెలుగు నిర్వాహకులు జగన్మోహన్‌రెడ్డిలు కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు.

దుస్తుల పంపిణీ

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆర్కే షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని జగదీష్ కాలనీలో గల కారుణ్య అనాథ బాలల ఆశ్రమంలోని విద్యార్థులకు షాపింగ్ మాల్ అధినేత దొడ్డిపట్ల సత్తిలింగం దుస్తులు పంపిణీ చేశారు. మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్టు బాధ్యులు కొప్పుల మురళి, షాపింగ్ మాల్ నిర్వాహకులు దొడ్డిపట్ల కొటేష్, నాయకులు నక్కా ప్రసాద్, నరేష్ కుమార్, ఎండి జిందా, గౌతమి స్పైసీ కృష్ణారెడ్డి, ట్రస్టు సభ్యులు సాయికుమార్, చైతన్య, నాగరాజు, పార్థసారథి పాల్గొన్నారు.

విద్యార్థినులకు బ్లాంకెట్లు..

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని పెదవాగు ప్రాజెక్ట్ వద్దగల ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థులకు శనివారం బ్లాంకెట్లు అందించారు. స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మీ చేతుల మీదుగా గిరిజన సంక్షేమ శాఖ ద్వారా అందించిన బ్లాంకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రోజా, వైస్ ప్రిన్సిపాల్ జయ, వార్డు సభ్యురాలు ఆకుల రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ..

నామా ముత్తయ్య ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. మండల పరిధిలోని రెడ్డిగూడెం పంచాయతీ సుద్దగోతులగూడెం గ్రామానికి చెందిన కొండరెడ్లకు నూతన సంవత్సర కానుకగా ఉచితంగా దుప్పట్లను సర్పంచ్ యాట్ల మహేశ్వరరెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మందపాటి మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు శ్రీను పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల అందజేత



ములకలపల్లి : మండలకేంద్రంలో డాక్టర్ జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం 200 మంది దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేశారు. ట్రస్ట్ సభ్యులు, సింగరేణి ఉద్యోగి డాక్టర్ విజయ్‌కుమార్ ఆర్థికసాయంతో స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సున్నం నాగమణి, ట్రస్ట్ కో–ఆర్డినేటర్ మోదుగు జోగారావు, ఏకేపీ ఏపీఎం రవీందర్, ట్రస్ట్ సభ్యులు వర్సా లక్ష్మణ్, ఆర్టీసీ సిబ్బంది కిన్నెర ఆనందరావు, శ్యాంసన్ పాల్గొన్నారు.

4న ఉచిత వైద్య శిబిరం

అశ్వారావుపేటరూరల్: ఈ నెల 4న స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వద్ద ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ జయలక్ష్మీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం ఐటీడీఏ సహకారంతో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో వైద్య నిపుణులు పాల్గొని, ఉచితంగా సేవలు అందిస్తారని ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు నిర్వహిస్తామని తెలిపారు.

అంతా.. నయా జోష్..

నూతన సంవత్సర సందడి ప్రారంభం

- రద్దీగా కేక్, స్వీట్ల దుకాణాలు
- వేడుకలపై పోలీసుల నజర్



భద్రాచలం అర్బన్: రంగులు అమ్ముతున్న మహిళ



చంద్రుగొండ : కేక్ దుకాణం వద్ద సందడి



అమ్మకానికి పెట్టిన వివిధ రకాల స్వీట్లు

భద్రాచలంఅర్బన్/చంద్రుగొండ : కాలగర్భంలో మరో ఏడాది నేటితో గడిచిపోనుండగా కొత్త ఆశలతో నూతన ఆంగ్ల సంవత్సరాదికి స్వాగతం పలికేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. శనివారం సాయంత్రం నుంచే ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. మార్కెట్లు కొనుగోళ్లతో కిటకిటలాడుతున్నాయి. నూతన సంవత్సర వేడుకలపై జాగ్రత్తగా ఉండాలని ఇప్పటికే పోలీసుశాఖ పలు సూచనలు చేయడంతో అందుకనుగుణంగా వేడుకలు జరుపుకొనేలా సిద్ధం చేసుకుంటున్నారు. అర్ధ రాత్రి దాటిపోయేవరకూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పండుగ వాతావరణంలో వేడుకలు జరుపుకున్నారు. మద్యం దుకాణాలకు అర్ధరాత్రి వరకూ తెరచుకునే అవకాశం కల్పించడంతో కళకళలాడాయి. నూతన సంవత్సరం సందర్భంగా మటన్, చికెన్ కొనుగోళ్లు పెరిగాయి. చిన్నాపెద్ద తేడాలేకుండా వేడుకలను సంబురంగా జరుపుకున్నారు.

రంగవల్లులు.. సంబురాలు..

ఇళ్ల ముంగిళ్లలో వేసే రంగవల్లులు అబ్బురపర్చనున్నాయి. శుక్రవారమే కొంతమంది వీటికి కావాల్సిన రంగులను కొనుగోలు చేశారు. తమతమ వాకిళ్లలో శుభాకాంక్షలు తెలుపుతూ ముగ్గులు వేశారు.

బిర్యానీ, కేక్, కూల్‌డ్రింక్‌లపై ఆఫర్లు...

న్యూ ఇయర్‌కు కావాల్సిన కేకులు, స్వీట్లు, బిర్యానీలకు గిరాకీ ఉండడంతో మార్కెట్లో హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు ఆఫర్లు ప్రకటించారు. ముందస్తుగానే ప్రత్యేక ఆఫర్లు ఏర్పాటు చేశారు. అన్ని బిర్యానీలు, కేక్‌లు, స్వీట్ల కొనుగోలుకు గిరాకీ పెరగగా ఆఫర్లతో జనాన్ని ఆకట్టుకున్నారు. మద్యం దుకాణాలు సైతం అదే స్థాయిలో దర్శనమిచ్చాయి.

పోలీసుల పెట్రోలింగ్..

నూతన సంవత్సర వేడుకల్లో యువత ఫుల్ జోష్‌గా ఉండగా పోలీసులు ఆదివారం తెల్లవారుజాము వరకు పెట్రోలింగ్ నిర్వహించారు. పోలీసులు ప్రత్యేక బృందాలుగా తనిఖీలు చేపట్టి, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు.

ముస్తాబైన దేవాలయాలు, చర్చిలు

ఇదిలా ఉండగా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పలు దేవాలయాలు, చర్చిలు ముస్తాబు చేశారు. విద్యుత్ కాంతులతో తీర్చిదిద్దారు. అర్ధ రాత్రి వరకు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేసి న్యూఇయర్‌కు స్వాగతం పలికారు. అదే విధంగా చర్చిలను సైతం విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు.

జోరుగా అమ్మకాలు



నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి స్వీట్స్ కొనుగోలు చేస్తున్నారు. సాధారణ రోజుల కంటే పది శాతం ఎక్కువ అమ్మకాలు ఉంటాయి. ఈ సారి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. నూతన ఏడాదిని ఆనందంతో స్వాగతం పలికేందుకు స్వీట్లు ప్యాకెట్లు పంపిణీ చేస్తారు.

– బిర్రు సుధాకర్, స్వీట్స్ వ్యాపారి, భద్రాచలం

కట్టుదిట్టమైన బందోబస్తు



న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. వేడుకలకు నిర్వహణకు మద్యం తాగి వాహనాలు నడపొద్దు. డిసెంబరు 31 అర్ధరాత్రి సమయంలో బైక్ ర్యాలీలు నిర్వహించొద్దు. వాహన తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తాం. ఎక్కడైనా శాంతి భద్రతల సమస్య ఉత్పన్నమైతే డయల్ 100కు కాల్ చేయాలి.

– బి. రోహిత్‌రాజ్, ఏఎస్పీ, భద్రాచలం

రసాభాసగా 'డబుల్ ఇళ్ల' గ్రామసభ



వాగ్వాదం పడుతున్న లబ్ధిదారులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో నిర్మించిన 20 డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల కేటాయింపు కోసం ఏర్పాటు చేసిన గ్రామసభ రసాభసగా సాగింది. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బోడా పద్మ అధ్యక్షతన గ్రామసభను అధికారులు ఏర్పాటు చేశారు. గ్రామసభలో తహసీల్దార్ భద్రకాళి డబుల్ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించారు. అధికారులు ఎంపిక చేసిన వారు అర్హులు కారని, అర్హులైన వారికి ఇళ్ల కేటాయింపులో అన్యాయం జరిగిందని లబ్ధిదారులు తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగారు. అధికారులు డబుల్ ఇళ్ల సర్వే తప్పుగా చేశారని ఆరోపించారు. అధికారులు మరలా సర్వే చేసి, అర్హులైన వారిని గుర్తించి, ఇళ్లు కేటాయించాలని ఆందోళన చేశారు. దీంతో తహసీల్దార్ డబుల్ ఇళ్లకు మరలా సర్వే చేస్తామని హామీ ఇచ్చి, గ్రామసభను ముగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సున్నం లలిత, ఉప సర్పంచ్ పర్సా వెంకటేశ్వర్లు, ఆర్ఐ మధు, పంచాయతీ సెక్రటరీ ఖాదర్, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోధనోపకరణాల మేళా

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మినగరం గ్రామంలోని బాలికల ఆశ్రమ పాఠశాల ఆవరణలో శనివారం బోధనోపకరణాల మండల మేళాను నిర్వహించారు. ఈ మేళాను ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మలు ప్రారంభించారు. ఈ మేళాలో ఉపాధ్యాయులు తయారుచేసిన బోధనాభ్యస ఉపకరణాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళి,యంఇఓ సున్నం సమ్మయ్య, ఎఫ్ఎల్ఎన్ నోడల్ ఆఫీసర్ కేవీ కాంతారావు, ఎంఆర్‌జీ ఏజే.ప్రభాకర్, కాంప్లెక్స్ హెచ్ఎంలు, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆందోళనలకు సిద్ధం కావాలి

చర్ల: ప్రభుత్వ స్కీంల పరిరక్షణకు జనవరి 6న మండల, జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ఆందోళనలకు సిద్ధం కావాలని సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు మైపా విజయశీల పిలుపునిచ్చారు. తేగడ, ఆర్ కొత్తగూడెం సెక్టార్ల అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమావేశం శనివారం మండలంలోని కుదునూరులో చిలకమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ విజయశీల మాట్లాడుతూ... ఐఎల్‌ఓ సిఫార్సుల ప్రకారం స్కీం వర్కర్లందరినీ కార్మికులుగా గుర్తించాలని, చట్టబద్ధమైన సౌకర్యాలను కల్పించాలని, స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం స్కీం వర్కర్లకు బడ్జెట్‌లో కోత పెడుతుందని ఫలితంగా ప్రభుత్వ స్కీంలు నిర్లక్ష్యం చేయబడుతున్నాయని విమర్శించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదిలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కమల మనోహరి, పుష్ప, కృష్ణవేణి, త్రివేణి, సావిత్రి, లక్ష్మీ, సోభారాణి, నర్సమ్మ, సుభద్ర, శమంతకమణి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమావేశం

దమ్మపేట: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు, సీడీపీఓ జ్యోతి సమావేశం నిర్వహించారు. శనివారం మండలంలోని పట్వారిగూడెం సెక్టార్ పరిధిలోని సుధాపల్లి గ్రామంలో అంగన్వాడీ టీచర్లతో సీడీపీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ... మండల పరిధిలోని ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పౌష్టిక ఆహారం అందించాలని సూచించారు. అనంతరం నూతన సంవత్సరం సందర్భంగా కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ హైమావతి, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతకు బహుమతి అందజేత



బహుమతి అందజేస్తున్న పాయం, ఎంపీపీ

అశ్వాపురం: మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ గ్రామంలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా నిలిచిన అంబేడ్కర్ లెవెన్ జట్టుకు శనివారం పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మొదటి బహుమతి అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌లో కట్టంవారిగూడెం, అంబేడ్కర్ లెవెన్ జట్లు తలపడగా అంబేడ్కర్ లెవెన్ జట్టు విజేతగా, కట్టంవారిగూడెం జట్టు రన్నరప్‌గా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీటీసీ కమటం నరేష్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఖదీర్, వేములపల్లి రమేష్, ఓరుగంటి రమేష్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, అమృత హాస్పిటల్ డాక్టర్ బాబురావు, దానధర్మ ట్రస్ట్ చైర్మన్ గంటా రాధ, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు..

అశ్వారావుపేటరూరల్: కొత్త ఏడాది సందర్భంగా విద్యార్థినులకు శనివారం రంగవల్లుల పోటీలను నిర్వహించారు. స్థానిక జవహర్ విద్యాలయం వద్ద నిర్వహించిన ఈ పోటీల్లో రంగు రంగుల ముగ్గులను వేశారు. అనంతరం ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విజేతలకు పాఠశాల ప్రిన్సిపాల్ మైథిలి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

సామాజిక సేవలు స్ఫూర్తిదాయకం



వితరణ అందజేస్తున్న జీఎం

మణుగూరు రూరల్ : మణుగూరు ఏరియా సింగరేణి ఉద్యోగుల సామాజిక సేవలు స్ఫూర్తిదాయకమని ఏరియా జీఎం జి.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శనివారం పీకేఓసీ బేస్‌వర్క్ షాప్ ఉద్యోగుల సహకారంతో అమ్మనాన్న వృద్ధాశ్రమానికి రూ.10వేల విలువ చేసే రెండు సింగిల్ కాట్ మంచాలు, తెలంగాణ ఉద్యమకారుడు ఎండి.రహీం పాషా వైద్యానికి రూ.10వేలు, ఎర్రం శశికుమార్‌కు రూ.10వేలను ఏరియా జీఎం వెంకటేశ్వరరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్వోటు జీఎం డి లలిత్‌కుమార్, అధికారులు లక్ష్మీపతిగౌడ్, నాగేశ్వరరావు, శ్రీనివాసచారి, నర్సిరెడ్డి, ఎస్ రమేష్, వీరభద్రుడు, డి వెంకటేశ్వర్లు, టీబీజీకేఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీకి వినతి

భద్రాచలంఅర్బన్: ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఉత్తర ద్వార దర్శనం రోజున ప్రెస్ గ్యాలరీలోకి ఇతరులను అనుమతించవద్దని ఏఎస్పీ రోహిత్‌కు టీయూడబ్ల్యూజె (ఐజేయు) నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఏఎస్పీకి వినతి పత్రం అందించారు. పాస్‌లు కలిగిన జర్నలిస్టులను ఇబ్బందులకు గురి చేయొద్దని, గేట్ దగ్గర లోకల్ పోలీస్ ఆఫీసర్‌ను నియమించాలని కోరారు.

ఇద్దరిపై కేసు

అశ్వారావుపేటరూరల్: అతివేగంగా వాహనాలు నడిపిన ఇద్దరిపై శనివారం స్థానిక పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎస్సై సాయికిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రింగ్ రోడ్ సెంటర్లో వాహనాల తనిఖీ నిర్వహించగా, ఇదే సమయంలో ఇద్దరు వ్యక్తులు ద్వి చక్రవాహనాలను పరిమితికి మించి వేగంగా నడిపినట్లు గుర్తించారు. దీంతో ఇద్దరిపై వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాలీ డ్రైవర్‌పై ..

ఓ ట్రాలీ డ్రైవర్‌పై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సాయికిశోర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుర్రాల చెరువు గ్రామానికి చెందిన ర్యాలీ ధనకుమార్ గత నెల 27న ద్విచక్రవాహనంపై అశ్వారావుపేట వచ్చే క్రమంలో, ట్రాలీ ఆటో ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ధనకుమార్ గాయపడి ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. శనివారం ధనకుమార్ డిశ్చార్జ్ అయ్యి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రతీ కార్యకర్తకు అండగా..



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న విప్ రేగా కాంతారావు

మణుగూరు రూరల్ : ప్రతీ కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. ఈ మేరకు స్థానిక క్యాంప్ కార్యాలయంలో విప్ సమక్షంలో 40 కుటుంబాలు శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే రేగా కాంతారావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. అనంతరం బూర్గంపాడు మండలం సారపాక–గాంధీనగర్ ఏరియాకు చెందిన లావుడ్యా లాల్‌సింగ్‌కు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.37వేల చెక్కును రేగా అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలా మారిందన్నారు. అనంతరం నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ పర్వదినాలను పురస్కరించుకొని రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో బీఆర్ఎస్ కల్చరల్ విభాగం ఆధ్వర్యంలో 7వ తేదీ నుండి జరగబోయే క్రీడాపోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. మణుగూరు మున్సిపాలిటీ పైలట్‌కాలనీ–గాంధీనగర్ ఏరియాకు చెందిన ప్రతాపగిరి శంకర్‌రావు ఇటీవలే అనారోగ్యంతో మరణించగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మృతుడు చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.6వేలను మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, పీఏసీఎస్ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అడపా అప్పారావు పాల్గొన్నారు.

పరిశుభ్రత పనులకు రూ.2లక్షలు అందజేత

మణుగూరు పట్టణ పరిశుభ్రత పనుల కోసం పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ నుండి రూ.2లక్షల చెక్కును అందజేశారు. ప్రతీ రోజు 20 మంది కార్మికులు 22 రోజుల పాటు పట్టణ పారిశుద్ధ్య పనుల నిర్వహించిన నేపథ్యంలో ట్రస్ట్ ద్వారా కార్మికుల జీతభత్యాల కోసం ఈ ఆర్థిక సహాయాన్ని అందించినట్లు ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలిపారు.

శ్రీ కృష్ణావతారంలో పర్ణశాల రామయ్య



కృష్ణావతారంలో దర్శనమిస్తున్న రామయ్య



తెప్పోత్సవానికి సిద్ధం చేసిన హంస వాహనం

దుమ్ముగూడెం: పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా తొమ్మిదో రోజు శనివారం శ్రీ కృష్ణావతారంలో రామయ్య దర్శనిమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రతాపురం భార్గవాచార్యులు, శేషం కిరణ్‌కుమారాచార్యులు, భరద్వాజచార్యులు, వెంకటాచార్యులు ప్రత్యేక పూజలను, అభిషేకాలను నిర్వహించి, స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా కృష్ణావతారం గొప్పతనం, విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఓ భవానీ రామకృష్ణ, ఆలయ సూపరింటెండెంట్ కిషోర్, ఉత్సవాల ప్రత్యేకాధికారి నిరంజన్‌కుమార్, ఆలయ ఇన్‌చార్జ్ చంటి, సిబ్బంది రాము, శివ తదితరులు పాల్గొన్నారు.

తెప్పోత్సవానికి ముస్తాబైన హంసవాహనం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో తెప్పోత్సవ కార్యక్రమానికి అధికారులు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పవిత్ర గోదావరి నదీ తీరంలో హంసవాహనంపై శ్రీ సీతారామచంద్ర లక్ష్మణ స్వాములను విహరింపచేయడానికి ఆలయ అధికారులు వాహనాన్ని సిద్ధం చేశారు. తెప్పోత్సవం తిలకించేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు అందచేసేందుకు లడ్డూ, పులిహోర ప్రసాదాలను ఆలయ అధికారులు సిద్ధం చేశారు. గోదావరిలో ప్రమాదం లోతు తెలిసేలా సూచికలు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు.

అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు తగవు

చంద్రుగొండ: అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భోగి కృష్ణ, కుక్కడపు రామారావు, రాయల చందర్‌రావు, లక్ష్మయ్య, కన్నయ్య, రాయల వెంకటేష్ పాల్గొన్నారు.

అశ్వాపురం: అయ్యప్ప స్వామిపై నరేష్ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ అయ్యప్ప మాలధారులు మండల కేంద్రంలో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారి పై శనివారం ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఎస్సై జితేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి కోటేశ్వరరావు, గోవర్ధనాచారి, రమణయ్య, కందుల శ్రీను, గోపాలకృష్ణ, చందర్‌రావు, ముత్తినేని వెంకన్న, మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: అయ్యప్ప స్వామిపై దుర్భాషలాడిన నరేష్‌ను అరెస్టు చేయాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్ భద్రాచలం శాఖ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పరిషత్ ఉపాధ్యక్షులు త్రిబులెక్స్ చక్రవర్తి, తిరుపతిరావు, కార్యదర్శి సాయి, సహాయ కార్యదర్శి సిద్ధార్థ, భజరంగ్ దళ్ సంయోజక్ ఏకె నాయుడు, సహా సంయోజక్ లక్ష్మీనారాయణ, ఫని పాల్గొన్నారు.

గుండాల: హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్ పై పీడీ యాక్టు కేసు నమోదు చేయాలని అయ్యప్ప భక్తులు, బీజేపీ, బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. బైరి నరేష్ చేసిన వివాదస్పద వ్యాఖ్యలకు నిరసనగా శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి , స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అఖిలభారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి సభ్యులు యాసారపు రవి, యాసారపు సురేష్, గుండెబోయిన నాగరాజు, మానాల ఉపేందర్, తాడోజు సురేష్, మానాల శ్రావణ్, కలాం, యాకరాజు, లక్ష్మీనారాయణ, నరేష్, పిల్లి కృష్ణ, రమేష్, శ్యాం, బీజేపీ మండలాధ్యక్షుడు సోలం సతీష్, బీఎస్పీ నాయకులు బొమ్మెర రాంబాబు పాల్గొన్నారు.

నిర్వాసితులకు 'డబుల్' ఇళ్లు అందించాలి

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని మనుబోతుల చెరువు నిర్వాసితులకు డబుల్ బెడ్ రూం ఇళ్లను 15 మందికి మొదటి ప్రాధాన్యతగా గుర్తించి మంజూరు చేయాలని మాజీ వార్డు మెంబర్ సున్నం గంగ కోరారు. ఈ మేరకు శనివారం కాలనీవాసులతో కలిసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. భద్రాచలంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్లను ప్రాధాన్యతగా మనుబోతుల చెరువు కాలనీ వాసులకు అందించాలని కోరారు. నాయకులు జి.లక్ష్మణ్, బంటు, రామకృష్ణ, కళావతి, నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

మోదీ మాతృమూర్తికి నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

చర్ల: ప్రధాని మోదీ మాతృమూర్తి హీరాబెన్‌కు బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం చర్లలో పార్టీ మండలాధ్యక్షుడు నక్కా కన్నయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో హీరాబెన్ చిత్ర పటానికి మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యావతి, నియోజకవర్గ జాయింట్ సెక్రటరీ బిట్రుగుంట క్రాంతికుమార్, సీనియర్‌నాయకులు శ్రీధర రామచంద్రరావు, ముత్తవరపు రత్తయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంతపురి సురేష్‌కుమార్, బత్తుల వెంకటేశ్వర్లు, ఆచకొండ అనీల్, చంద్రశేఖర్, హరినాథ్, సమ్మయ్య, సోమరాజు, శేషగిరి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



బూర్గంపాడు: క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సిద్ధార్థ మొహంతి, తదితరులు

బూర్గంపాడు: ఐఎన్‌టీయూసీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ సిద్ధార్థ మొహంతి ఆవిష్కరించారు. శనివారం ఐటీసీ పీఎస్‌పీడీలో జరిగిన కార్యక్రమంలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మారం వెంకటేశ్వరరెడ్డి, ఐటీసీ ఉన్నతాధికారులు శ్యామ్‌కిరణ్, బసఫ్‌ఘోష్, శైలేందర్‌సింగ్, కె.రాంబాబు, టీఎస్ భాస్కర్, విష్ణుదత్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌనె రామారావు, యారం పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఏటీఏ మండలాధ్యక్షుడు వాసం ఆదినారాయణ అధ్యక్షతన స్థానిక విద్యాశాఖ అధికారి సున్నం సమ్మయ్య, ఏటీఏ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి జయ బాబు ఏటీఏ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మడకం మోతిర్, కారం సోమశేఖర్, నాయకులు సోయం హనుమంతరావు, కొమరం నాగయ్య, కల్లూరి బొర్రయ్య, పూనెం రమేష్, సోడి రాంబాబు,వర్స వసంతరావు, కుంజా రవికుమార్, వి.శాలిని, పి.హిందులత, పి.పార్వతి, అరుణ కుమారి, కారం శ్రీను, చీమల నంగయ్య,రామ్.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పిస్తున్న.. నవ సమాజ నిర్మాతలు

ఖమ్మంగాంధీచౌక్ : సమాజంలో పేదరికం.. నిరుద్యోగం పెరిగిపోతోంది. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదువుకున్న వారికి ఉపాధి కరువవుతోంది. ఈ నేపథ్యంలో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. ఇలా దిక్కుతోచని స్థితిలో ఉండే యువత కొందరైతే. ఎన్నో కలలతో సొంతంగా వ్యాపార సంస్థను నిర్వహించాలనే కోరికతో ఉండే ఔత్సాహికులు కొందరు. నిరుద్యోగులు ఉపాధి లేక ఎలా నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారో..? వ్యాపారం నిర్వహించాలనే తపన ఉన్న ఔత్సాహికులు కూడా పెట్టుబడి, నిర్వహణ తదితర వాటిపై మల్లగుల్లాలు పడుతుంటారు. వ్యాపారంలో భాగస్వామ్యం ఉంటే ఒక ఇబ్బంది.. లేకపోతే ఒక ఇబ్బందిలా ఉంటుంది. ఇలాంటి బాధలన్నింటినీ తట్టుకుని ఒక వ్యాపార సంస్థను నెలకొల్పి.. దానిలో రాణించడం చిన్న విషయం కాదు. ఎందరో దిగ్గజాలు దెబ్బతిన్న సందర్భాలున్నాయి. వ్యాపారం ఏదైనా వ్యవస్థను నడపడం అంటే కేవలం లాభార్జన మాత్రమే కాదని కొందరు వ్యాపారులు నిరూపిస్తుంటారు. వారు అటు వ్యాపారం చేయడంతో పాటు మానవీయ కోణాన్ని కూడా స్పృశిస్తుంటారు. వీరు న్యాయమైన వ్యాపారంతో వినియోగదారులకు ఆత్మీయులుగా మారడంతోపాటు సాటివారికి సాయం అందించే సుగుణం కలిగి ఉంటారు. తమ వద్ద పనిచేసే వారిని కూడా సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకుంటుంటారు. నిరుద్యోగం పెరిగి పోతున్న ప్రస్తుతం సమాజంలో ఇటువంటి నిఖార్సైన వ్యాపారుల అవసరం ఇటు సమాజానికి కూడా ఎంతో ఉంది. కుటుంబ పోషణ చేయడానికి నానా తిప్పలు పడుతున్న నిరుద్యోగులకు ఈ వ్యాపారులు మార్గనిర్దేశకులు అవుతున్నారు. పరస్పర సహకారంతో వారి వ్యాపారాభివృద్ధితోపాటు.. తమ వద్ద పనిచేస్తున్న వారికి జీవనోపాధి కల్పిస్తూ ముందుకు పోతుంటారు. వ్యాపారం అంటేనే లాభాల వేట.. అటువంటి సమయంలో కూడా తమ వద్ద ఉన్న వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా. వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ.. వారితో ఇష్టంగా పని చేయించుకుంటున్న వ్యాపారులు ఎందరో. అటువంటి వారిలో కొందరే వీరే... వారి మాటల్లోని ఉపాధిని కల్పించడంలో ఉన్న ఫీలింగ్ ఎలా ఎంటుందో ఈ నూతన సంవత్సరం రోజున వారి మాటల్లోనే తెలుసుకుందాం.



మనం బ్రతుకుతూ.. పది మందికి ఉపాధిని కల్పించడం మనుసుకు నిజమైన ఆనందాన్ని ఇస్తుంది. సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలి.

– చెరుకూరి కృష్ణమూర్తి, భద్రాద్రి బ్యాంక్ చైర్మన్



మనం చేసే వ్యాపారంలో ఉద్యోగులదే కీలక భూమిక. పది మందికి ఉపాధి కల్పించడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను.

– మద్దిపుడి రాంబాబు, ఎండీ, రంగరాయ టీవీఎస్, వైరా రోడ్డు, ఖమ్మం.



మనం చేస్తున్న వ్యాపారంతో పది కుటుంబాలకు ఉపాధి కల్పించి ఆదుకోవడంలో ఎంతో సంతృప్తిగా ఉన్నది.

– పారుపల్లి వీరభద్ర రావు, కృష్ణ అండ్ హావేలి గ్రూప్స్ అధినేత, బైపాస్‌రోడ్డు, ఖమ్మం.



మనం బ్రతకుతూ మనతో పాటు పది మందికి ఉపాధి ఇవ్వడం దేవుడు ఇచ్చిన వరం మరియు అదృష్టంగా భావిస్తున్నాను.

– పారుపల్లి రాము, కృష్ణ అండ్ హావేలి గ్రూప్స్ అధినేత, వైరా రోడ్డు, ఖమ్మం.



ఉద్యోగం చేస్తే నేను ఒక్కడినే ఉపాధి పొందుతా.. అదే వ్యాపారం చేస్తే పది మందికి ఉపాధి కల్పించిన వాడిని అవుతాను. ఇదే ఫార్ములా నాకు సంతృప్తినిస్తుంది.

– వద్దెం విజయ్, శ్రీ విజయ్ గ్రానైట్ ఇండస్ట్రీస్ అధినేత, ముదిగొండ.



వేల మంది విద్యార్థులకు విద్యనందిస్తూ, నిరుద్యోగులకు ఉపాధినిస్తూ, వారిని మా కుటుంబ సభ్యులలో ఒకరిగా భావించడం మాకు ఎంతో సంతృప్తినిస్తుంది.

– రవి మారుత్, హార్వెస్ట్ విద్యాసంస్థలు, ఖమ్మం.



మన ద్వారా పది మంది ఉపాధి పొంది బ్రతుకుతుంటే కలిగే ఆనందంకన్నా మరేది ఉండదు.

– సీహెచ్ కిషోర్, సీతా మోటర్స్ ప్రొప్రైటర్, మమత రోడ్డు, ఖమ్మం.



మనం చేసే పనిలో సమాజ హితం ఉంటే మానసిక తృప్తినిస్తుంది.

– ధనాల పేరయ్య, శ్రీ హర్ష కన్వెన్షన్, వెంకటగిరి క్రాస్ రోడ్డు, ఖమ్మం.



పది మంది పేద కుటుంబాలకు ఉపాధి ఇవ్వడం పూర్వ జన్మలో మనం చేసుకున్న పుణ్యం.

– మోర్ల సత్యనారాయణ, ప్రొప్రైటర్, హోటల్ భవాని గ్రాండ్, వీడీవోస్ కాలనీ, ఖమ్మం.



మనం ఉపాధి పొందుతూ మరో పది మంది నిరుద్యోగులకు ఉపాదినివ్వడం సమాజసేవలో భాగమే.

– నాగసేతు మాదవన్, చైర్మన్, ది కే స్ట్రీట్, శ్రీశ్రీశ్రీ సర్కిల్, వైరా రోడ్డు, ఖమ్మం.



పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు పది మందికి ఉపాధి కల్పించడం ఆనందంగా ఉంది.

– డా॥ కావ్యచంద్ యాలముడి, సిఈఓ, కావ్య హాస్పిటల్, ఖమ్మం.



మా విద్యా సంస్థల ద్వారా ఎంతో మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం మాకు సంతోషంగా ఉన్నది.

– కాటిరెడ్డి నాగమణి, ఛైర్‌పర్సన్, కెయల్‌ఆర్ గ్రూఫ్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్, పాల్వంచ



మన వ్యాపారాభివృద్ధికి అనునిత్యం అండగా ఉంటేది ఉద్యోగులే. వారికి ఉపాధి కల్పించడం చాలా సంతోషంగా ఉన్నది.

– కొమ్మినేని నర్సింహారావు, పావని పెయింట్స్, ఖమ్మం.



వైద్య విద్యతో మంచి వైద్యాన్ని అందిస్తూ నలుగురికి ఉపాధి కల్పిస్తున్నందుకు గర్వంగా ఉంది.

– డాక్టర్ కెసోజు భరత్‌బాబు, ఎండీ, ప్రశాంతి హాస్పిటల్, నెహ్రూనగర్, ఖమ్మం.



విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతూ, సమాజంలో ఉన్న నిరుద్యోగ సమస్యకు మా ద్వారా కొంత పరిష్కారం చూపిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది.

– కొండా శ్రీధర్ రావు, రెజోనెన్స్ విద్యాసంస్థలు, ఖమ్మం.